www.trinetnews.com

తెలంగాణ ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 సంచిక 76 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు ఆదివారం అక్టోబర్ 18, 2026 పేజీలు:12 వెల.10/-

## కరెన్సీ నోటుపై మునుగోడు పిన్‌కోడ్.. నెట్టింట వైరల్‌గా మారిన రూ.50 నోటు!







# తెలంగాణలో కరువు మంటలు..
# రేవంత్ సర్కార్‌కు సవాల్!

- ఎల్‌నినో ప్రభావంతో నీటి, విద్యుత్ కష్టాలు
- రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్.. సరఫరాపై ఒత్తిడి
- 15,906 మెగావాట్ల నుంచి 19,000 మెగావాట్లకు పెరిగిన విద్యుత్ డిమాండ్
- శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో తగ్గుతున్న నీటిమట్టాలు
- రైతులకు విద్యుత్ సరఫరాపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- బోర్లు నడవక పంటలకు నీరందక రైతుల ఆందోళన
- కాళేశ్వరం మరమ్మతులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు
- కరువు నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం అవసరం
- రాజకీయాలకు అతీతంగా రైతులను ఆదుకోవాల్సిన సమయం

తెలంగాణలో కరెంటు కష్టాలు రానురాను పెరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంపై సీరియస్‌గా స్పందించారు. రైతులకు సరిగా విద్యుత్ సరఫరా కాకపోతే ఐఎఎస్‌లపై కూడా చర్య తీసుకుంటానని హెచ్చరించారు. నిజానికి ఈ కరెంటు సంక్షోభం రావడానికి పలు కారణాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రజలను వణికిస్తున్న ఎల్‌నినో ప్రభావం తెలుగు రాష్ట్రాలతో సహా ఇతర కొన్ని రాష్ట్రాలపై అధికంగా కనిపిస్తోంది. వర్షాలు సరిగా కురవకపోవడం సంక్షోభంగా మారింది. మహారాష్ట్రలో పుణే నగరంలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. నీటిని దుర్వినియోగం చేస్తే ఐదువేల రూపాయల జరిమానా విధిస్తామని కొన్ని నగరాలలో అధికారులు ప్రకటనలు చేస్తున్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రితో పాటు, మంత్రులు ఆయా జిల్లాలలో జరుగుతున్న కార్యక్రమాలలో రైతులకు, ప్రజలకు హెచ్చరికలు చేస్తున్నారు. వచ్చే అక్టోబర్ వరకు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, తాగునీటి సంక్షోభం కూడా వస్తుందని వారు చెబుతున్నారు. నీటి వినియోగం అధికంగా ఉండే యాసంగి పంటలు వేయవద్దని సలహా ఇస్తున్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరుతున్నారు. హైదరాబాద్ కు ఒకప్పుడు తీవ్రమైన నీటి ఎద్దడి ఉండేది. కాని ఆయా ప్రభుత్వాలు కృష్ణా, గోదావరి నుంచి నీటిని రప్పించే స్కీముల వల్ల చాలావరకు మెరుగు అయింది. అయినా ఈసారి హైదరాబాద్‌లో కూడా తాగునీటి గండం ఉందని చెబుతున్నారు. వ్యవసాయానికి సంబంధించి, గోదావరి నది మట్టం బాగా దిగువన ఉండడంతో ప్రాజెక్టుల నిర్మాణం కష్టసాధ్యం అయింది.




## తెలంగాణలో 315 మండలాల్లో కరువు: తుమ్మల

- 315 మండలాల్లో కరువు పరిస్థితులు
- కేంద్రం తక్షణ సాయం అందించాలి
- పంటలకు 100% మద్దతు ధర కల్పించాలి
- విత్తనాలు, సూక్ష్మ సేద్యానికి సాయం కోరిన మంత్రి
- ఉపాధి, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం

## శిశువుల ఆహార ఉత్పత్తుల్లో ఆ రెండు కలపొద్దు: FSSAI




ఆరు నెలల వరకు వయసున్న శిశువులకు సంబంధించిన ఆహార ఉత్పత్తుల్లో ఫ్రక్టోజ్, సుక్రోజ్‌లను కలపడాన్ని నిషేధించాలని 'భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ' ప్రతిపాదనలు చేసింది.



# విద్యుత్, నీటిని పొదుపుగా వాడండి

- ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పొదుపు అవసరం
- నీరు, విద్యుత్‌ను జాగ్రత్తగా వినియోగించాలి: డిప్యూటీ సీఎం భట్టి
- రాష్ట్రంలో ప్రస్తుతం 20 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్
- వాతావరణంలో మార్పులు.. పెరుగుతున్న వేడిమి
- హైదరాబాద్‌లో బతుకమ్మ యంగ్ ఫిల్మ్‌మేకర్స్ ఇఅవార్డుల ప్రదానోత్సవంలో భట్టి విక్రమార్క వ్యాఖ్యలు

హైదరాబాద్:
ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని బతుకమ్మ యంగ్ ఫిల్మ్‌మేకర్స్ అవార్డుల వేడుకలో డిప్యూటీ సీఎం పాల్గొని పురస్కారాలు అందజేశారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చాలా చలి ఉండేదని, ప్రస్తుతం అందుకు భిన్నంగా వాతావరణం ఉందని గుర్తు చేశారు. చలి నుంచి రక్షించుకునే రోజుల నుంచి వేడిమి నుంచి రక్షించుకునే రోజులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 20వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉందన్నారు.

# ఎల్‌నినో
## కాంగ్రెస్ తెచ్చిన కరువు కాదు

**ఎల్‌నినో ప్రకృతి వైపరీత్యం.. రాజకీయాలు చేయొద్దు**




- నీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడాలి
- వచ్చే యాసంగిలో నీటి లభ్యత ఆధారంగా పంటలు వేసుకోవాలి
- గౌరవెల్లి ప్రాజెక్టును త్వరలో పూర్తి చేస్తాం
- హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు, గ్లాస్ బ్రిడ్జి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి
- నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు
- ప్రభుత్వ భూముల కబ్జాలను సహించేది లేదు

2 లో

# త్వరలో హనుమకొండలో ఐటీ టవర్స్: మంత్రి శ్రీధర్‌బాబు

- హనుమకొండలో ఐటీ టవర్స్ నిర్మిస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు
- ఓరుగల్లు యువతకు ఐటీ ఉద్యోగ అవకాశాలపై ఆశలు
- హనుమకొండ హాఫ్ మారథాన్‌లో వేలాది మంది పాల్గొనడం
- 5K, 10K, 21K విభాగాల్లో మారథాన్ నిర్వహణ
- ఫిట్‌నెస్‌పై అవగాహన.. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపు
- ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజుతో కలిసి మారథాన్‌లో పాల్గొన్న మంత్రి
- బాలసముద్రం టీ స్టాల్ వద్ద యువతతో సరదాగా ముచ్చటించిన ప్రజాప్రతినిధులు




ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించడంతో పాటు మత్తుకు దూరంగా ఉండాలని పిలుపునిస్తూ హనుమకొండలో నిర్వహించిన మారథాన్‌లో ఓరుగల్లు ప్రజలు వేల సంఖ్యలో పాల్గొన్నారు. నాయిని విశాల్ ట్రస్ట్ చైర్మన్ మీూూ నాయిని రాజేందర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ మారథాన్‌లో మంత్రి శ్రీధర్ బాబు, పలువురు మీూూలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. యువతతో కలిసి రన్నింగ్‌లో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు.. బాలసముద్రంలో ఓ టీస్టాల్ వద్ద ఆగి సరదాగా గడిపారు. టీ తాగుతూ సెల్ఫీలు దిగి సందడి చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఓరుగల్లు ప్రజలకు శుభవార్త తెలిపారు.

**రేవంత్ నీటిని విడిచిపెడితే..**

# చంద్రబాబు ఒడిసిపట్టారు

- తెలంగాణ ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసేందుకు కుట్రలు
- రేవంత్‌రెడ్డి తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్నారని విమర్శ
- దేవాదులలో 10 మోటార్లకు మూడే నడుపుతున్నారని ఆరోపణ
- మోటార్లన్నీ నడిపితే వరంగల్ జిల్లాకు కరువు వచ్చేది కాదని వ్యాఖ్య
- ఏపీలో కుప్పం వరకు నీళ్లు.. తెలంగాణలో మాత్రం నీటి కష్టాలు
- కన్నెపల్లి మోటార్ల విషయంలోనూ కాలయాపన చేశారని విమర్శ
- ఎల్‌నినో హెచ్చరికలున్నా ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆరోపణ
- రాజకీయాల కోసం మోటార్లు నడపకుండా కరువును తెచ్చారని ధ్వజం




హైదరాబాద్:
తెలంగాణ ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నంతకాలం ఏపీ పాలకులు ఏమీ మాట్లాడలేదని.. రేవంత్‌రెడ్డి వచ్చాకే వారు కొత్త ప్రతిపాదనలు తెస్తున్నారని పేర్కొన్నారు.

# సీఆర్పీఎఫ్ జవాన్ల పదోన్నతులకు కీలక ప్రతిపాదన

- 30 ఏళ్ల తర్వాత పాత హోదాల పునరుద్ధరణకు యోచన
- లాన్స్ నాయక్, నాయక్ హోదాలను తిరిగి ప్రవేశపెట్టే ప్రతిపాదన
- సిబ్బంది అభిప్రాయాలు సేకరించాలని సీఆర్పీఎఫ్ ప్రధాన కార్యాలయం ఆదేశం
- కానిస్టేబుళ్ల తొలి పదోన్నతికి 22--25 ఏళ్ల నిరీక్షణ
- కొత్త హోదాలతో మరో రెండు పదోన్నతులకు అవకాశం
- దేశవ్యాప్తంగా సైనిక్ సమ్మేళనాల ద్వారా అభిప్రాయాల సేకరణ
- క్రమశిక్షణ, విధుల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచన




సీఆర్పీఎఫ్ జవాన్లకు పదోన్నతుల జాప్యాన్ని నివారించేందుకు కీలక ప్రతిపాదన తెరపైకి వచ్చింది. 30 ఏళ్ల కిందట రద్దు చేసిన లాన్స్ నాయక్ హోదాలను తిరిగి ప్రవేశపెట్టాలని ఉన్నతాధికారులు యోచిస్తున్నారు.

# అభిజీత్ దీప్కేకు షరతులతో కూడిన బెయిల్



సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు ఢిల్లీలోని న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం ఢిల్లీలో తిరంగా మార్చ్ కోసం కనాట్‌ప్లేస్‌కు బయలుదేరిన అభిజీత్ దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఇచ్చిన శాంతి హామీని ఉల్లంఘించారని ఆరోపిస్తూ శనివారం ఉదయం ఆయన్ను అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా.. విచారించిన న్యాయస్థానం ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ క్రమంలో పీస్ బాండ్‌పై సంతకం చేయాలని ఆదేశించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత దీప్కే విడుదలవుతారని పేర్కొన్నాయి. ఢిల్లీలోని కనాట్‌ప్లేస్ వద్ద 'లెహ్రా దో తిరంగా' పేరుతో శుక్రవారం సీజేపీ తలపెట్టిన ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ సీజేపీ మద్దతుదారులు, పలు విద్యార్థి సంఘాల సభ్యులు జాతీయ పతాకాలను పట్టుకొని కనాట్‌ప్లేస్‌కు వెళ్లారు. అక్టోబర్ 10న ఇచ్చిన శాంతి హామీపత్రాన్ని ఉల్లంఘించారని పేర్కొంటూ శనివారం ఉదయం దీప్కేతో పాటు మరికొందరిని అరెస్టు చేశారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
ఆదివారం అక్టోబర్ 18, 2026
www.trinetnews.com

# ప్రకృతి వైపరీత్యమే ఎల్ నినో... ఇదేదో కాంగ్రెస్ తెచ్చిన కరువు కాదు: మంత్రి పొన్నం ప్రభాకర్

మొదటిపేజీ తరువాయి

ఎల్ నినో ప్రకృతి వైపరీత్యమేనని.. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు కాదని అన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. శనివారం ( అక్టోబర్ 17 ) సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ లో ఎల్లమ్మ చెరువును సందర్శించారు మంత్రి పొన్నం. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. సద్దుల బతుకమ్మ కోసం ఎల్లమ్మ చెరువు దగ్గర ఘనంగా ఏర్పాట్లు చేశామని.. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును, గ్లాస్ బ్రిడ్జ్ ను, గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని అన్నారు.

కబడ్డీ అకాడమీతో పాటు, హుస్నాబాద్ కు స్విమ్మింగ్ ఫుల్ కూడా శాంక్షన్ అయ్యిందని... 2007 లో శంకుస్థాపన చేసిన గౌరవెల్లి ప్రాజెక్టు అడ్డంకులు, సుప్రీంకోర్టు కేసు అవరోధాలు కూడా తొలగిపోయి కాలువల కోసం భూ సేకరణ జరుగుతోందని అన్నారు. త్వరలోనే గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తామని, ఇరిగేషన్ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు మంత్రి పొన్నం.

వ్యవసాయానికి విద్యుత్ కు సంబంధించి ఈ పంట వరకు ఉదయం నుండి సాయంత్రం దాకా రాత్రి కూడా కొంత సమయం విద్యుత్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని.. సీఎం రేవంత్ చెప్పిన విధంగా ప్రజలందరూ కరెంట్, నీళ్ళు పొదుపుగా వాడాలని అన్నారు. ఈ వచ్చే సీజన్ లో వరి పంట కాకుండా నీటి లభ్యత ఆధారంగా రైతులు పంటలు వేసుకోవాలని సూచించారు మంత్రి పొన్నం.

వర్షం పడ్డ పడక పోయిన ఆది ప్రకృతికి సంబంధించిన అంశమని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లలో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇచ్చారో తెలీదు కానీ.. మా ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గానికి 3వేల 500 ఇళ్ళు ఇచ్చామని అన్నారు.

రాష్ట్రంలో ఎక్కడ కూడా గుడిసెలు లేకుండా చూస్తున్నామని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా అర్హత ఉన్న అందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని, దీన్ని రాజకీయం చేయొద్దని అన్నారు మంత్రి పొన్నం. ప్రభుత్వ స్థలమును ఎవరు కబ్జా చేయడానికి వీలు లేదని, ఆది ప్రభుత్వం అవసరాలకు ఉపయోగిస్తుందని

# త్వరలో హనుమకొండలో ఐటీ టవర్స్: మంత్రి శ్రీధర్‌బాబు

మొదటిపేజీ తరువాయి

త్వరలో హనుమకొండలో IT టవర్స్ నిర్మిస్తామని ప్రకటించారు.

హనుమకొండ హాఫ్ మారథాన్ రన్‌తో సందడిగా మారింది. హయగ్రీవచారి మైదానం నుండి 5 కి,మీ, 10 కి.మీ, 21 కి.మీ మారథాన్ రన్ నిర్వహించారు. వరంగల్ పఛ్చిమ మీాా నాయిని రాజేందర్ రెడ్డి తన తనయుడు విశాల్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మారథాన్ లో వేలాదిమంది యువత, విద్యావంతులు, ఉద్యోగులు, వైద్యులు, క్రీడాకారులు, వికలాంగులు కూడా పాల్గొన్నారు. హయగ్రీవచారి మైదానం లో మారథాన్ రన్ ను మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతకు చక్కటి సందేశం ఇచ్చిన మంత్రి.. ఓరుగల్లు ప్రజలకు తీపి కబురు చెప్పారు. త్వరలో హనుమకొండలో IT టవర్స్ నిర్మిస్తామని ప్రకటించారు

అనంతరం హనుమకొండలో ఆసక్తికర దృశ్యం చోటుచేసుకుంది. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్థానిక టీ దుకాణం వద్ద ఆగి టీ తాగుతూ సందడి చేశారు.నిత్యం ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలతో బిజీగా ఉండే ప్రజాప్రతినిధులు ఇలా రోడ్డుపక్కన సాధారణ టీ స్టాల్ వద్ద కనిపించడంతో ఆ దృశ్యం ఆసక్తిని రేకెత్తించింది. హాఫ్ మారథాన్ ఉత్సాహం మధ్య టీ కప్పుతో కాసేపు సరదాగా గడిపిన నేతల దృశ్యం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది

# తెలంగాణలో కరువు మంటలు.. రేవంత్ సర్కార్‌కు సవాల్!

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో బోరుబావులపై ఆధారపడి జరిగే వ్యవసాయం కూడా చాలా ఎక్కువే. సుమారు 90వేల బోర్లు పనిచేస్తున్నాయి. కాని బోర్లు పనిచేయాలంటే విద్యుత్ సరఫరా సజావుగా ఉండాలి. లేకపోతే పంటలకు నీరు అందక దెబ్బతింటాయి. ఇప్పటికే ఆ పరిస్థితులు పలు చోట్ల ఏర్పడినట్లు వార్తలు వస్తున్నాయి. ఎక్కడైనా కాల్వల ద్వారా నీరు వస్తుంటే, ఆయా గ్రామాల రైతుల మధ్య గొడవలు జరుగుతున్నాయట. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షలు చేసి ప్రత్యామ్నయ చర్యలపై ఆదేశాలు ఇస్తున్నారు. ఆ క్రమంలో పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్ అందించాలని ఆయన స్పష్టం చేశారు. వచ్చే 20 రోజులు కీలకం అని ఆయన అన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని రేవంత్ కరోనా సమస్యతో పోల్చారు. ముఖ్యమంత్రి సమీక్షలు ఎలా ఉన్నా, ఆదేశాలు ఎంత గట్టిగా ఉన్నా ఆయా ప్రాంతాలలో కరెంటు కష్టాలు ఎంత తీవ్రంగా ఉన్నయో తెలిపే కథనాలు మీడియాలో వస్తున్నాయి. రైతులు జనరేటర్లు పెట్టుకుని బోర్లను నడిపించుకోవల్సి వస్తోంది. దీని వల్ల అదనపు వ్యయాన్ని భరించవలసి వస్తోంది. కొన్ని చోట్ల టాంకర్ల నీటితో పొలాలను తడుపుకుంటున్నారు. కొందరు రైతులు తమ పాట్లను వివరిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు కూడా పెడుతున్నారు. దీనివల్ల బియ్యం ధరలు బాగా పెరిగి సామాన్యులు కూడా కష్టాలపాలవుతారు.

గత ఏడాది ఇదే సీజన్ లో 15,906 మెగావాట్ల డిమాండ్ ఉంటే, ఈ ఏడాది ప్రస్తుతం అది ఏకంగా 19వేల మెగావాట్లకు పెరగడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. శ్రీశైలం, నాగార్జున సాగర్ వంటి కీలకమైనప్రాజెక్టులలో నీటి మట్టం పడిపోవడంతో జల విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోతుంది. మరోవైపు యాదాద్రి వంటి థర్మల్ ప్రాజెక్టులు పూర్థి స్థాయిలో పనిచేయడం లేదని చెబుతున్నారు. రైతులకు విద్యుత్ సరఫరా చేయడానికి ఎదురవుతున్న ఆటంకాలను ప్రభుత్వం గుర్తించాలి. దానికి తగ్గట్లుగా ఏర్పాట్లు చేయలేకపోతే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా పెద్దగాప్రయోజనం ఉండదు. విద్యుత్ కొనుగోలు చేయడానికి కూడా దొరకడం లేదని స్వయంగా రేవంత్ రెడ్డే చెప్పారు. అలాంటప్పుడు అధికారులు చేయగలిగింది ఏమి ఉంటుందన్నది ప్రశ్న. ఇప్పటికే పలుచోట్ల విద్యుత్ కోతలు జరుగుతున్నట్లు చెబుతున్నారు. రైతులకు ఉచితంగా విద్యుత్ ఇవ్వవలసి ఉంటుంది. పూర్తిగా విద్యుత్‌ను అందుకు కేటాయిస్తే ఆర్థికంగా పెద్ద సమస్యలే వస్తాయి. అందువల్ల బాలెన్స్ చేసుకోవలసి ఉంటుంది.

హైదరాబాద్ వంటి నగరంలో విద్యుత్ సరఫరాలో కోతలు ఎక్కువగా ఉంటేప్రభుత్వంపై విమర్శలు తీవ్రంగా వస్తాయి. దీనిని కూడా ప్రభుత్వం సహజంగానే పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ సందర్భంగా కొన్ని విషయాలు ప్రస్తావించాలి. ఉమ్మడి ఏపీని విభజించి తెలంగాణను ఏర్పాటు చేయాలని కేంద్రం ప్రతిపాదించినప్పుడు ఆనాటి ముఖ్యమంత్రి ఎన్.కిరణ్ కుమార్ రెడ్డి విభజనను వ్యతిరేకిస్తూ పలు ప్రజెంటేషన్లు ఇచ్చారు. విడిపోతే తెలంగాణకు సాగునీరు, విద్యుత్ సమస్య వస్తుందన్నది కీలకమైనది. అప్పట్లో తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్ తదితరులు ఆయన వాదనను తీవ్రంగా ఖండించారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన వ్యూహాత్మకంగా విద్యుత్ , సాగునీరులపై బాగా దృష్టి పెట్టారు. అందులో కొన్ని విమర్శలు వచ్చినా, తెలంగాణ ఏర్పడిన కొద్దికాలానికే 24 గంటలు కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేసే స్థితికి తీసుకువచ్చారు. దానికి ముఖ్యకారణం ఛత్తీస్‌గడ్ నుంచి విద్యుత్ కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. అలాగే జాతీయ స్థాయిలో గ్రిడ్ ఏర్పడడం కూడా ఉపయోగపడింది. యాదాద్రి పవర్ ప్లాంట్ వంటివాటిని నిర్మించారు. అదే టైమ్‌లో గోదావరి నదిపై కాళేశ్వరం ప్రాజెక్టును భారీ స్థాయిలో చేపట్టారు. లక్ష కోట్లకు పైగా వ్యయంతో దీనిని నిర్మించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయినా టీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు వెళ్లింది. ఈ ప్రాజెక్టులో భాగంగా పలు రిజర్వాయర్లను నిర్మించారు. ఎత్తిపోతల ద్వారా నీటిని ఈ రిజర్వాయర్లలోకి తరలించారు. అయితే ఈ విషయాలలోను తర్వాత కాలంలో ఆరోపణలు రావడం, కేసీఆర్ రాజకీయంగా కొంత నష్టపోవడం కూడా జరిగిందని చెప్పాలి.

విద్యుత్ కొనుగోలు ఒప్పందాలలో, యాదాద్రి ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపించేది. ఈ పార్టీ అధికారంలోకి వచ్చాక వాటిపై విచారణకు కూడా ప్రయత్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఒక పిల్లర్ కుంగింది. దాంతో కేసీఆర్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్ పవర్ లోకి రావడంతో ఒక కమిషన్ వేసి విచారణ చేయించింది. అవేమీ కొలిక్కి రాలేదు. ఇవన్నీ ఒక రాజకీయ గేమ్‌గా మిగిలాయి. అయితే పిల్లర్ కుంగడం పెద్ద సమస్యకాదని, ప్రాజెక్టులకు ఇలాంటివి జరుగుతుంటాయని, కాని కావాలని కాంగ్రెస్ ప్రభుత్వం దానిని మరమ్మతు చేయకుండా జాప్యం చేస్తోందని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. కారణం ఏమైనా రేవంత్ ముఖ్యమంత్రి అయి మూడేళ్లయినా, కాళేశ్వరం ప్రాజెక్టు డామ్ రిపేర్లను ఒక కొలిక్కి తీసుకురాలేకపోయారు. ఫలితంగా గోదావరికి వరద వచ్చినా ఆ నీటిని మోటార్ల ద్వారా తోడి ఈ రిజర్వాయర్లలోకి పెట్టలేకపోయారు. అందువల్లే నీటి సంక్షోభం అధికంగా ఉందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.

తెలంగాణలో ఎల్‌నినో వల్ల వచ్చిన కరువు కాదని, ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు అని బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావులు ఆరోపిస్తున్నారు. ఏపీతో సహా వివిధ రాష్ట్రాలలో కరువు ఎలా వచ్చిందని కాంగ్రెస్ ఎదురు ప్రశ్నిస్తోంది. ఇప్పటికే సుమారు 300 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం కరువు సహాయ చర్యలుచేపట్టడానికి కేవలం ఒక్క రాష్ట్ర ప్రభుత్వం వనరులే సరిపోవు. కేంద్ర ప్రభుత్వం కూడా ఎల్‌నినో ప్రభావిత రాష్ట్రాలకు సహాయపడడానికి ముందుకు రావాలి. కరువుపై రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలు ఎలా ఉన్నా తక్షణమే రైతులను, రైతు కూలీలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవడానికి ముందుకు రావాలి. లేకుంటే తెలంగాణలో చాలా

# కరెన్సీ నోటుపై మునుగోడు పిన్‌కోడ్.. నెట్టింట వైరల్‌గా మారిన రూ.50 నోటు!

మొదటిపేజీ తరువాయి

డబ్బు చేతులు మారడం సహజం.. కానీ ఆ డబ్బుపై ఉండే ఓ నంబర్ ప్రత్యేకంగా ఓ ప్రాంతాన్ని గుర్తుచేస్తే? అలాంటి ఆసక్తికర ఘటనే ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా కరెన్సీ నోట్లపై ఉండే సీరియల్ నంబర్లను ఎవరూ పెద్దగా పట్టించుకోరు. కానీ అరుదైన నోట్లు, నాణేలను సేకరించే వారికి మాత్రం వాటిలోని ప్రత్యేక అంకెల కూర్పు ఎంతో ఆసక్తిని కలిగిస్తుంది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి సేకరించిన రూ. 50 నోటు ఇప్పుడు ఇలాంటి ప్రత్యేకతతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.




చాలామందికి పుస్తకాలు చదవడం, సంగీతం వినడం వంటి హాబీలు ఉంటాయి. మరికొందరికి పాత వస్తువులు, నాణేలు, కరెన్సీ నోట్లు, పోస్టల్ స్టాంపులను సేకరించడం ప్రత్యేకమైన అభిరుచి. ఈ అలవాటు ద్వారా చరిత్ర, సంస్కృతి, గత కాలపు విశేషాలను తెలుసుకునే అవకాశం కూడా ఉంటుంది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన కైలాస్ సంతోష్ ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆయనకు ప్రత్యేకమైన కరెన్సీ నోట్లను సేకరించడం హాబీ. ముఖ్యంగా పోస్టల్ పిన్‌కోడ్‌లతో సరిపోలే సీరియల్ నంబర్లు ఉన్న నోట్లను సేకరించడంపై ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ఆయన సేకరించిన ఓ రూ. 50 నోటు ఇప్పుడు ప్రత్యేకంగా నిలిచింది. కైలాస్ సంతోష్ సేకరించిన రూ. 50 కరెన్సీ నోటుపై 508244 అనే సీరియల్ నంబర్ ఉంది. ఈ ఆరు అంకెల నంబర్ నల్లగొండ జిల్లా మునుగోడు పోస్టల్ పిన్‌కోడ్‌తో సరిపోలడంతో ఆ నోటుకు ప్రత్యేక గుర్తింపు లభించింది. అయితే, ఈ నంబర్‌ను మునుగోడు ప్రాంతానికి గుర్తింపుగా కరెన్సీపై ప్రత్యేకంగా ముద్రించలేదు. నోటుపై సహజంగా ఉన్న సీరియల్ నంబర్.. మునుగోడు పిన్‌కోడ్‌తో యాదృచ్ఛికంగా సరిపోవడమే ఇక్కడి విశేషం. ఈ ఆసక్తికరమైన పోలికే నోటుపై అందరి దృష్టి పడేలా చేసింది.

**సోషల్ మీడియాలో వైరల్..**

ఈ ప్రత్యేకతను గుర్తించిన కైలాస్ సంతోష్ ఆ కరెన్సీ నోటు ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. దీంతో ఈ విషయం మునుగోడు ప్రాంత ప్రజల దృష్టిని ఆకర్షించింది. తమ ప్రాంత పిన్‌కోడ్‌తో సరిపోలే నంబర్ ఓ కరెన్సీ నోటుపై కనిపించడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ నోటుకు సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు కూడా ఆసక్తిగా స్పందిస్తున్నారు. సాధారణంగా అరుదైన సీరియల్ నంబర్లు, ఒకే అంకె వరుసగా ఉండే నోట్లు, ప్రత్యేకమైన అంకెల కూర్పు ఉన్న కరెన్సీ నోట్లపై కలెక్టర్లు ఆసక్తి చూపుతుంటారు. అయితే, ప్రతి ప్రత్యేక నోటుకూ మార్కెట్‌లో భారీ ధర లభిస్తుందని చెప్పలేం. దాని అరుదుదనం, పరిస్థితి, కలెక్టర్ల ఆసక్తి వంటి అంశాలపై విలువ ఆధారపడి ఉంటుంది.

మునుగోడు పిన్‌కోడ్‌తో సరిపోలిన సీరియల్ నంబర్ కారణంగా ఈ రూ. 50 నోటు ఆసక్తికరంగా మారింది. ఏదేమైనా, చిన్న నంబర్ ఓ ప్రాంతంతో అనుకోకుండా అనుబంధం ఏర్పరచుకోవడం ఈ కరెన్సీ

### రేవంత్ నీటిని విడిచిపెడితే..

# చంద్రబాబు ఒడిసిపట్టారు

మొదటిపేజీ తరువాయి

నీళ్ల విషయంలో రేవంత్‌రెడ్డి తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

“అత్యంత ముఖ్యమైన నీళ్ల విషయంలో నిర్లక్ష్యం ఎందుకు? దేవాదులలో 10 మోటార్లు ఉన్నా.. మూడు మాత్రమే ఆన్ చేశారు. 10 మోటార్లు నడిస్తే వరంగల్ జిల్లాకు కరవు వచ్చేది కాదు. ఏపీలో క్రాప్ హాలీడే లేదు.. కరవు లేదు. దేవాదుల మోటార్లు నడపకే.. నీళ్లు కిందకు పోయాయి. ఏపీలో కుప్పం వరకు నీళ్లు తీసుకెళ్లి జలహారతులు పడుతున్నారు. రేవంత్ రెడ్డి నీటిని విడిచిపెడితే.. చంద్రబాబు ఒడిసిపట్టారు. ఎల్‌నినోపై హెచ్చరికలు చేస్తున్నా.. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదు. కన్నెపల్లి మోటార్లు నడపమంటే.. కాలయాపన చేశారు. రాజకీయాల కోసం మోటార్లు నడపకుండా.. లేని కరవును మనపై రుద్దారు” అని హరీశ్‌రావు విమర్శించారు.

# సీఆర్పీఎఫ్ జవాన్ల పదోన్నతులకు కీలక ప్రతిపాదన

మొదటిపేజీ తరువాయి

ఈ ప్రతిపాదనపై సిబ్బంది అభిప్రాయాలు తెలుసుకోవాలని సీఆర్పీఎఫ్ ప్రధాన కార్యాలయం దేశవ్యాప్తంగా ఉన్న విభాగాలను ఆదేశించింది. రెండు రోజుల్లో సైనిక్ సమ్మేళనాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించాలని సూచించింది.

1997లో కేంద్ర హోంశాఖ ఆదేశాలతో లాన్స్ నాయక్, నాయక్ హోదాలను రద్దు చేసి, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ హోదాల్లో విలీనం చేశారు. ఆర్మీలో మాత్రం అవి కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం 3.25 లక్షల మంది సిబ్బంది ఉన్న సీఆర్పీఎఫ్‌లో కానిస్టేబుళ్లకు తొలి పదోన్నతి వచ్చేందుకు సగటున 22-25 ఏళ్లు పడుతోంది. కొత్త హోదాలు అమల్లోకి వస్తే హెడ్ కానిస్టేబుల్ స్థాయికి చేరకముందే మరో రెండు పదోన్నతులు రానున్నాయి.

ఆర్మీలో నాలుగేళ్లు పూర్తి చేసుకున్న అగ్నివీరుల తొలి బ్యాచ్ ఈ ఏడాది చివరిలో పదవీ విరమణ చేయనుంది. వీరు కేంద్ర సాయుధ పోలీసు బలగాల్లో చేరేందుకు అర్హులు. అయితే నిర్ణీత గడువులో పదోన్నతులు కల్పిస్తేనే ఈ ప్రతిపాదనతో ప్రయోజనం ఉంటుందని మాజీ పారామిలటరీ సిబ్బంది సంఘం ప్రధాన కార్యదర్శి రణ్‌బీర్ సింగ్ తెలిపారు. కొత్త హోదాల వల్ల బెటాలియన్ క్రమశిక్షణ, విధుల నిర్వహణకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఓ సీనియర్ కమాండెంట్ సూచించారు.

# తెలంగాణలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు: మంత్రి తుమ్మల

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి వివరించారు. సూక్ష్మ సేద్యం, మధ్యంతర పంటల విత్తనాలకు తక్షణమే సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఖేత్ బచావో అభియాన్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ నుంచి మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన అంశాలను లేవనెత్తారు. మొక్కజొన్న, జొన్న, ఇతర పంటలకు 100 శాతం మద్దతు ధర కల్పించాలని కోరారు. ధరల మద్దతు పథకం కింద 25 శాతం కొనుగోలు పరిమితిని తొలగించాలన్నారు. రసాయన ఎరువుల ధరలు, రాయితీలను హేతుబద్ధీకరించాలన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

# శిశువుల ఆహార ఉత్పత్తుల్లో ఆ రెండు కలపొద్దు: FSSAI

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు ‘ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్స్ ఫర్ ఇన్‌ఫాంట్ న్యూట్రిషన్) రెగ్యులేషన్స్, 2020’కు సవరణ ముసాయిదాను ప్రచురించింది. పసితనంలోనే అదనపు చక్కెరలు తీసుకోవడాన్ని తగ్గించడం ద్వారా శిశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, పోషకాహార భద్రతను బలోపేతం చేయడమే ఈ ప్రతిపాదనల లక్ష్యమని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ తెలిపింది.

“బిడ్డ ఎదుగుదలకు మొదటి ఆరు నెలలు ఎంతో కీలకం. ఈ వయసు వారికి అవసరమైన పోషకాలు అందించేలా.. సంబంధిత ఆహార ఉత్పత్తుల్లో ఫ్రక్టోజ్, సుక్రోజ్‌లను కలపకుండా చూసేలా ఈ ప్రతిపాదనలను రూపొందించారు. మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలనే ప్రభుత్వ సిఫార్సులను ప్రోత్సహించేందుకూ ఈ చర్యలు తోడ్పడతాయి. బాల్యంలోనే ఊబకాయం, సంబంధిత ఆరోగ్య సవాళ్లను అరికట్టడం కూడా ఈ ప్రతిపాదనల ఉద్దేశం” అని సంబంధిత శాఖ తెలిపింది. ముసాయిదా ప్రతిపాదనలపై 60 రోజుల్లోపు అభ్యంతరాలను, సూచనలను సమర్పించవచ్చని పేర్కొంది.

# తుపాకీ కోసం వెళ్తే ఊహించని ట్విస్ట్.. తనిఖీల్లో బయటపడ్డది చూసి అధికారులే అవాక్కు..

ఈ మధ్యకాలంలో అటవీ ప్రాంతాల్లో మూగజీవాల వేట విచ్చలవిడిగా సాగుతుంది. కొందరు ముఠాలుగా ఏర్పడి వన్యప్రాణులను వేటాడుతూ ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇందుకోసం విద్యుత్ తీగలు, మారణాయుధాలు, నాటు తుపాకులను వాడుతున్నారు. ఈ క్రమంలో అమాయక జంతువులతో పాటు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది కూడా ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అడవి జంతువులను నాటు తుపాకీతో వేటాడుతున్నారనే సమాచారంతో దమ్మపేట అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. దమ్మపేట మండలం అంకంపాలెం పంచాయతీ పరిధిలోని కొడిశెలగూడెం గ్రామానికి చెందిన పి. సుబ్బులి నాగులు అనే వ్యక్తి నాటు తుపాకీతో అటవీ జంతువులను వేటాడుతున్నాడని అధికారులకు పక్కా సమాచారం అందింది. దీంతో దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది కొడిశెలగూడెంలోని నాగులు నివాసంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

**సోదాల్లో ఊహించని ట్విస్ట్**

అధికారులు ఇల్లంతా క్షుణ్ణంగా గాలించినప్పటికీ ప్రధానంగా వెతుకుతున్న నాటు తుపాకీ మాత్రం వెంటనే దొరకలేదు. అయితే సోదాల సమయంలో ఇంట్లో అనుమానాస్పదంగా పడి ఉన్న రెండు ప్యాకెట్లను అధికారులు గమనించారు. వాటిని తెరిచి పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్లు తేలడంతో అధికారులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఇంట్లో మరింత లోతుగా సోదాలు నిర్వహించారు. మొత్తం మూడు ప్యాకెట్లలో నిల్వ ఉంచిన 5 కిలోల గంజాయిని గుర్తించారు. వీటితో పాటు నాటు తుపాకీలలో ఉపయోగించే 52 చిన్న సైజు ఇనుప చక్రాలు (పెల్లెట్స్), ఇతర ఇనుప సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

**తుపాకీ కోసం పోలీసుల వేట..**

స్వాధీనం చేసుకున్న గంజాయి, సామగ్రితో పాటు నిందితుడిపై కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అయితే తనను పట్టుకోకుండా అధికారులను తప్పుదోవ పట్టించేందుకే నిందితుడు పక్కా ప్లాన్ ప్రకారం నాటు తుపాకీని ఎవరికీ అనుమానం రాని రహస్య ప్రదేశంలో దాచిపెట్టి ఉంటాడని పోలీసులు, అటవీ అధికారులు భావిస్తున్నారు. ఆ ఆయుధాన్ని రికవరీ చేసేందుకు నిందితుడి ఇంట్లో, సమీప ప్రాంతాల్లో మళ్లీ విస్తృత తనిఖీలు చేపట్టే అవకాశం ఉంది.

# మూడు దశల్లో సమగ్ర భూసర్వే

**285 గ్రామాల్లో సర్వే పూర్తి.. అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ**

**వచ్చేనెల చివరినాటికి మొదటి దశ పూర్తికి సన్నాహాలు**

**మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారు**

**పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూదార్ పట్టాల పంపిణీ**

**రెవెన్యూ అధికారుల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**

రాష్ట్రంలో భూ సమస్యలు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయించి, భూ యాజమాన్య హక్కులపై స్పష్టత కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను మూడు దశల్లో పూర్తి చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇప్పటికే 285 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేసి భూ యజమానుల నుంచి అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఇప్పటికే ఉన్న 411 రోవర్లకు అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని పేర్కొన్నారు. భూ సర్వేలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి సంతృప్తే ప్రాధాన్యంగా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూ సమస్యలు లేని తెలంగాణ నిర్మాణం కోసం ప్రభుత్వం సమగ్ర రీసర్వేకు శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ అధికారులతో భూ సర్వే పురోగతిపై నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలకు గానూ తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాలలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి, నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 285 గ్రామాల్లో సర్వే పూర్తయిందని వెల్లడించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనాధారమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ యాజమాన్య హక్కులపై స్పష్టత తీసుకురావడంతో పాటు తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు పరిష్కారం చూపడంలో సమగ్ర రీసర్వే కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం



వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారాలుగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, సర్వే నంబర్ల ఉపవిభాగాలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దుల్లో మార్పులు చోటుచేసుకోవడం వంటి కారణాలతో భూముల అసలు హద్దులపై స్పష్టత కొరవడిందన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రీయ పద్ధతుల్లో సమగ్ర రీసర్వే చేపడుతున్నట్లు వివరించారు.

గతంలో భూముల కొలతలకు ఉపయోగించిన గొలుసులు, కర్రలు, క్రాస్‌స్టాఫ్, మెజరింగ్ టేపుల వంటి సంప్రదాయ పరికరాలకు స్వస్తి పలుకుతూ డీజీపీఎస్, రోవర్లు, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా భూముల కొలతల్లో కచ్చితత్వం పెరగడంతో పాటు సర్వే వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరిచి, భవిష్యత్తులో సరిహద్దులపై వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం అవసరమైన సాంకేతిక పరికరాలను సమకూరుస్తోందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేశామని, అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని వెల్లడించారు. రోవర్ల వినియోగంతో భూముల సర్వేను వేగంగా, కచ్చితత్వంతో నిర్వహించేందుకు వీలవుతుందని చెప్పారు.

రీసర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపునిచ్చేలా భూదార్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సర్వే సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 2 కోట్ల 29 లక్షలకు పెరిగిందని వివరించారు. రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందని తెలిపారు.

**త్వరలో పాలేరులో భూదార్ పట్టాల పంపిణీ**

రీసర్వే ద్వారా ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక సర్వే పటాలు సిద్ధమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా భూ యాజమాన్య హక్కులపై స్పష్టత పెరగడంతో పాటు భవిష్యత్తులో భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల సమయంలో ఎదురయ్యే సమస్యలను తగ్గించేందుకు వీలవుతుందన్నారు.

తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని నేలకొండపల్లి మండలం కొంగర గ్రామ పరిధిలో ఉన్న మొత్తం 665 ఎకరాలలో వందశాతం రీసర్వేను విజయవంతంగా పూర్తిచేశామని త్వరలో భూదార్ పట్టాల పంపిణీ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.

భూ రీసర్వేలో అధికారులు తప్పనిసరిగా అనుసరించాల్సిన విధానాలపై మంత్రి గారు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో సర్వే నిర్వహించేందుకు వెళ్లే ముందు సంబంధిత పట్టాదారులకు విధిగా ముందస్తు నోటీసులు ఇవ్వాలని సూచించారు. సర్వే నిర్వహించే విషయం భూ యజమానులకు ముందుగానే తెలియజేయడం ద్వారా వారు అందుబాటులో ఉండి తమ భూముల హద్దులను నిర్ధారించుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. సర్వేకు ఒకటి రెండు రోజుల ముందు ఆయా గ్రామాల్లో తప్పనిసరిగా చాటింపు చేయాలని సూచించారు.

అదేవిధంగా, గ్రామాల్లోని ప్రభుత్వ భూములకు స్పష్టమైన మార్కింగ్ చేయాలని, గ్రామకంఠం హద్దులను నిర్ధారించిన తర్వాతే సర్వే చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు, గ్రామకంఠం పరిధుల విషయంలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో స్పష్టత తీసుకురావాలని సూచించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ యజమానుల అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి, పరిశీలించి పరిష్కరించాలని మంత్రి తెలిపారు. సర్వే ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూ రీసర్వేను అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా భావించకుండా, ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అత్యంత కీలక బాధ్యతగా గుర్తించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో, అంకితభావంతో పనిచేసి రీసర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. సర్వే సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, భూ యజమానులు సంతృప్తి చెందేలా ప్రతి చర్య చేపట్టాలని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజా కోణంలోనే ఆలోచించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు.

# వాయు కాలుష్య నియంత్రణకు సాంకేతిక పరిష్కారాలు

**స్టార్టప్‌లతో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ చర్చలు**

**తక్కువ ఖర్చుతో విస్తృతంగా అమలు చేయగల ఆవిష్కరణలకు ప్రాధాన్యం**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**

ఢిల్లీ--జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు తక్కువ ఖర్చుతో, విస్తృత స్థాయిలో అమలు చేయగల సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయాలని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ రంగంలో పనిచేస్తున్న స్టార్టప్‌లు, ఆవిష్కరణ సంస్థల ప్రతినిధులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. 'స్వచ్ఛమైన గాలిలో భాగస్వామ్యం.. మనందరి బాధ్యత' ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విధాన రూపకర్తలు, సాంకేతిక ఆవిష్కర్తల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ఈ సమావేశం ముందస్తు చొరవగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అమలు చేయగల పరిష్కారాలతో విధానాల అమలులో ఏకరూపత, పాలనలో పారదర్శకత పెరుగుతాయని తెలిపారు. వాయు కాలుష్య నిర్వహణకు సంబంధించిన తొమ్మిది కీలక రంగాల్లో సమస్యలను ప్రస్తావించి, వాటికి అనుగుణంగా సాంకేతికతలను అభివృద్ధి చేయడంపై చర్చించారు. పరిశ్రమల ఉద్గారాల నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలు, కాలుష్య నియంత్రణ పరికరాలు, వాహనాల పీయూసీ పరీక్షల్లో అక్రమాలకు తావులేని సాంకేతికత అవసరమని భూపేందర్ యాదవ్




స్పష్టం చేశారు. పరిశ్రమల ఉద్గారాల సమాచారాన్ని ఆయా ప్లాంట్ల నిర్వహణ సమాచారంతో అనుసంధానించడం ద్వారా అవకతవకలను గుర్తించవచ్చన్నారు. ఇందుకు కృత్రిమ మేధ కీలకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. నగరవ్యాప్తంగా గాలి నాణ్యత పర్యవేక్షణ, స్థానిక కాలుష్య పటాల తయారీ, కాలుష్య తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాల గుర్తింపు, ముందస్తు అంచనాలపై సమావేశంలో చర్చించారు. కృత్రిమ మేధ, సెన్సర్లు, ఉపగ్రహాలు, డ్రోన్లు, రిమోట్ సెన్సింగ్, సమాచార విశ్లేషణ ద్వారా కాలుష్య మూలాలను ఎప్పటికప్పుడు గుర్తించే అవకాశాలను ఆవిష్కర్తలు ప్రదర్శించారు. చెల్లుబాటయ్యే పీయూసీ ధ్రువపత్రాలు లేని వాహనాలు, నిర్దేశిత వయోపరిమితి దాటిన వాహనాల స్వయంచాలక గుర్తింపు పరిష్కారాలను వివరించారు. నిర్మాణ, కూల్చివేత ప్రదేశాల్లో దుమ్ము నియంత్రణ, తక్కువ ఖర్చుతో యాంత్రిక రహదారి శుభ్రత, రోడ్లపై దుమ్ము తిరిగి గాలిలోకి లేవడాన్ని పర్యవేక్షించడం, గుంతలను వేగంగా మరమ్మతు చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. స్వచ్ఛమైన వాహనాల వినియోగంతోపాటు ట్రాఫిక్ రద్దీ ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, వాహనాల రాకపోకలను మెరుగుపరచాలని మంత్రి సూచించారు. పంట అవశేషాలు, పట్టణ ఘన వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు పర్యావరణ అనుకూల పరిష్కారాలపై స్టార్టప్‌లు దృష్టి సారించాలని కోరారు. వరి గడ్డిని సేకరించి, రవాణా చేసి జీవ ఇంధనం, కంపోస్టు, పర్యావరణ అనుకూల ప్యాకేజింగ్ తదితర ఉత్పత్తులకు వినియోగించడం ద్వారా బహిరంగ దహనాన్ని తగ్గించవచ్చని తెలిపారు. పంట అవశేషాల నిల్వకు సంబంధిత సంస్థల సమన్వయంతో మార్గదర్శకాలు, క్షేత్రస్థాయి నిల్వ నమూనాలను రూపొందించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. విడివిడి సాంకేతిక పరిష్కారాలను సమగ్రంగా అనుసంధానించి, ఆర్థికంగా ఆచరణ సాధ్యమైన విధానాలుగా విస్తరించాలని మంత్రి సూచించారు. ఇప్పటికే అమలవుతున్న గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్, స్వచ్ఛ ఇంధనాలు, విద్యుత్ వాహనాల ప్రోత్సాహం వంటి చర్యలకు ఇవి తోడ్పడాలని పేర్కొన్నారు. సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్, ఢిల్లీ పర్యావరణ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, వాయు నాణ్యత నిర్వహణ కమిషన్, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఐడీబీఐలో ప్రభుత్వ వాటా తగ్గింపుపై స్పష్టీకరణ

**పరిమితి విధించే సవరణ 2003 చట్టంలో భాగం కాలేదని కేంద్రం వివరణ**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**

ఐడీబీఐలో ప్రభుత్వ వాటాకు సంబంధించి 2003లో జరిగిన శాసన పరిణామాలపై కొన్ని పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో వచ్చిన కథనాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ ఇచ్చింది. ప్రభుత్వ వాటా తగ్గింపుపై పరిమితి విధించాలని అప్పట్లో ప్రతిపాదించిన సవరణ తిరస్కరణకు గురైందని, పార్లమెంటు ఆమోదించిన చట్టంలో అది భాగం కాలేదని తెలిపింది.

2003 కేంద్ర బడ్జెట్ చర్చలు, ఐడీబీఐ రద్దు చట్టం--2003పై పార్లమెంటులో జరిగిన చర్చల సందర్భంగా ఈ సవరణను ప్రవేశపెట్టారని వివరించింది. అయితే, తుది చట్టంలో ఆ నిబంధనను చేర్చలేదని పేర్కొంది.

ఈ అంశాన్ని 'ఆల్ ఇండియా ఐడీబీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా అండ్ అదర్స్' కేసులో ఢిల్లీ హైకోర్టు పరిశీలించినట్లు కేంద్రం గుర్తుచేసింది. 2018 డిసెంబర్ 17న రిట్ పిటిషన్‌ను కొట్టివేస్తూ, పార్లమెంటు చర్చల్లో చేసిన ప్రకటనలు ఐడీబీఐలో కేంద్ర ప్రభుత్వ వాటా తగ్గింపును నిరోధించలేవని కోర్టు పేర్కొన్నట్లు తెలిపింది.

పార్లమెంటు ఆమోదించిన చట్టానికి సభలో చేసిన ప్రకటనలు ప్రత్యామ్నాయం కాలేవని, చట్టాన్ని అధిగమించలేవని తీర్పులో స్పష్టం చేసినట్లు వివరించింది. ప్రతిపాదిత సవరణను చట్టంలో చేర్చకపోవడం వల్ల కలిగే ప్రభావంపై పార్లమెంటుకు అవగాహన ఉందని కోర్టు అభిప్రాయపడినట్లు పేర్కొంది. సభలో చేసిన ప్రకటనలను ఉద్యోగులకు ఇచ్చిన హామీగా పరిగణించి, వాటి ఆధారంగా ప్రభుత్వ చర్యను అడ్డుకోవాలనే వాదన ఈ సందర్భంలో వర్తించదని కోర్టు తెలిపినట్లు కేంద్రం వివరించింది. ఐడీబీఐ రద్దు చట్టం--2003ను స్థిరపడిన చట్ట వ్యాఖ్యాన సూత్రాలకు అనుగుణంగానే అర్థం చేసుకోవాలని తీర్పులో పేర్కొన్నట్లు వెల్లడించింది.

## రోషన్ దౌలా కాలనీలో ఉచిత వైద్య శిబిరం 150 మందికి పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ

**బాలాపూర్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**

జనహిత సేవా ట్రస్ట్, ఆశ్రిత, రెయిన్‌బో హోమ్, కిమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలాపూర్‌లోని రోషన్ దౌలా కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాలాపూర్ ఎస్ఐ మహమ్మద్ సోహైల్ శిబిరాన్ని ప్రారంభించారు. పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరం



ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. శిబిరంలో కిమ్స్ ఆస్పత్రి వైద్యులు 150 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సలహాలతో పాటు మందులు అందజేశారు. ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ ఎం. శ్రీనివాస్ ఒంటినొప్పులతో బాధపడుతున్న వారికి వ్యాయామ పద్ధతులను వివరించి, ప్రదర్శించారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు మల్లోజు రవి, కార్యదర్శి డి. ప్రకాష్, కోశాధికారి జె. శివకుమార్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి నర్సింహమూర్తి, ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఎస్. నాగరాజు, ప్రోగ్రాం మేనేజర్ వి. పర్వతాలు, సిబ్బంది హేమలత, అనిత, జమున, వీరబాబు, శివమ్మ, అంగన్‌వాడీ టీచర్ రాధిక, జనహిత క్యాంపు కోఆర్డినేటర్ బి. నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

## ఖేత్ బచావో అభియాన్'పై కేంద్ర మంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి తుమ్మల

**తెలంగాణలో 315 మండలాల్లో కరువు పరిస్థితులు.. కేంద్రం తక్షణ సహాయం అందించాలి**

**సూక్ష్మ సేద్యం, మధ్యంతర పంటల విత్తనాలకు ప్రత్యేక అదనపు బడ్జెట్ కేటాయించాలి**

**మొక్కజొన్న, జొన్న సహా అన్ని ప్రధాన పంటలకు 100 శాతం కనీస మద్దతు ధర కల్పించాలి**

**ధరల మద్దతు పథకం కింద 25 శాతం కొనుగోలు పరిమితిని తొలగించాలి**

**ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించాలి**

**వ్యవసాయ కూలీలకు ఉపాధి, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,**




అక్టోబర్ 17: కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి అధ్యక్షతన శనివారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో కూడా ఈ ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని 22 అక్టోబర్ నుండి 30 నవంబర్ వరకు నిర్వహిస్తామని, దీనికి గాను అఖిల భారత వ్యవసాయ సంస్థలు, విశ్వ విద్యాలయాల సిబ్బంది సహకారంతో వీటిని గ్రామాలలో నిర్వహిస్తామని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలోని 315 మండలాల్లో కరువు తరహా పరిస్థితులు నెలకొంటున్నాయని మంత్రి తెలిపారు. పంటల పరిస్థితిని అంచనా వేయడం, అందుబాటులో ఉన్న నీటిని సంరక్షించడం, పంటలు కోతకు వచ్చే వరకు వాటిని కాపాడేందుకు అవసరమైన సాగునీరు, విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సూక్ష్మ సేద్యానికి, మధ్యంతర కాలంలో సాగు చేసే పంటలకు అవసరమైన విత్తనాల కోసం ప్రత్యేకంగా అదనపు బడ్జెట్ కేటాయించాలని మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వాతావరణ పరిస్థితుల వల్ల రైతులకు ఎదురయ్యే నష్టాలను తగ్గించేందుకు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు.

ఎరువుల ధరలు, సబ్సిడీల అంశాన్ని ప్రస్తావిస్తూ యూరియాపై అధిక సబ్సిడీ కారణంగా ఇతర ఎరువులతో పోలిస్తే దాని ధర తక్కువగా ఉందని, దీనివల్ల యూరియా అధిక వినియోగం పెరిగి నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని మంత్రి తెలిపారు. రైతులపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించి, ఎరువుల సమతుల్య వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు.

రైతులు పంటల మార్పిడికి ముందుకు రావాలంటే పండించిన పంటలకు కనీస మద్దతు ధరపై కొనుగోలు భరోసా కల్పించడం అత్యంత ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. మొక్కజొన్న, జొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు సహా అన్ని ప్రధాన పంటలను కనీస మద్దతు ధర (ఎంఎస్పీ )పై 100 శాతం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ధరల మద్దతు పథకం (ూూూ) కింద ప్రస్తుతం అమలులో ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కరువు పరిస్థితుల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి, ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. వీబీ --జీ రామ్ జీ పథకం కింద నిధుల కేటాయింపును పెంచడంతో పాటు వ్యవసాయానికి సంబంధించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా పొలాల్లో ఫామ్ పాండ్ల నిర్మాణం, నీటి సంరక్షణ, భూమి అభివృద్ధి పనులను ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు కేవలం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం మాత్రమే సరిపోదని, వారికి అవసరమైన ఆర్థిక సహాయం అందించడంతో పాటు పండించిన పంటలకు మార్కెట్‌లో కొనుగోలు భరోసా కల్పించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు అలవాటు పడింది'..

**-టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,**



అక్టోబర్ 17: బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు అలవాటు పడిందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. బీజేపీ విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రతిసారీ విదేశీ శక్తులను తెరపైకి తెస్తోందని మండిపడ్డారు. చైనా భూ ఆక్రమణపై మాట్లాడే దమ్ము మోదీకి లేదన్నారు. రోహింగ్యాల పేరుతో దేశ ప్రజల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. దొరికితే దొంగ అన్నట్లుంది బీజేపీ తీరు అంటూ మండిపడ్డారు. ఈడీ దాడులు కేవలం ప్రతిపక్ష పార్టీ నేతలపైనే ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. ఎన్నిక పక్రియ నిబంధనలను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎందుకు మార్చారని, కమిటీలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌ను ఎందుకు తొలగించారని పీసీసీ చీఫ్ నిలదీశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్ ఎన్నికైన రోజే ప్రమాదాన్ని గురించి రాహుల్ గాంధీ హెచ్చరించారని గుర్తుచేశారు. 'మీరు ప్రజల మద్దతుతో గెలవలేరు.. అందుకే ఓటు దొంగతనానికి పాల్పడ్డారు' అంటూ బీజేపీపై విరుచుకుపడ్డారు. పెద్ద రాష్ట్రాలలో ఓట్ల దొంగతనం ఎక్కువగా జరుగుతోందని అన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సీపీఎం మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నామని మహేశ్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో సీపీఎం కలసి పనిచేస్తోందని చెప్పారు. నేటి సీపీఎం పొలిట్‌బ్యూరో మీటింగ్ తర్వాత వారి నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తారన్నారు. ఇండియా కూటమిలోని అన్ని పార్టీల మద్దతు కూడగడతామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# వాతావరణ పరిశోధన ఫలాలు ప్రజలకు చేరాలి

**పుణె ఐఐటీఎంలో తొలి సీఎస్ఎస్ఐఎఫ్ సంప్రదింపుల సమావేశం**
**80కిపైగా సంస్థల నుంచి 150 మందికిపైగా ప్రతినిధుల భాగస్వామ్యం**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
వాతావరణ శాస్త్ర పరిశోధనలను ప్రజలకు ఉపయోగపడే సేవలుగా మలచడం, ప్రభుత్వ విధానాలు, వివిధ రంగాల నిర్ణయాలకు అవసరమైన సమాచారాన్ని అందించడం లక్ష్యంగా పుణెలో కీలక సమావేశం జరిగింది. కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ (ఐఐటీఎం) శనివారం 'క్లైమేట్ సైన్స్ ఇంటు సర్వీసెస్ ఫర్ ఇండియా ఫోరం' (సీఎస్ఎస్ఐఎఫ్) తొలి భాగస్వామ్య పక్షాల సంప్రదింపుల సమావేశాన్ని నిర్వహించింది.

దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 80కిపైగా సంస్థల నుంచి 150 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రభుత్వ శాఖలు, పరిశోధన, విద్యాసంస్థలు, సేవలందించే సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం, ప్రైవేటు రంగ ప్రతినిధులు వాతావరణ సమాచార అవసరాలపై చర్చించారు.

ఐఐటీఎం డైరెక్టర్ డాక్టర్ ఎ. సూర్యచంద్రరావు స్వాగతోపన్యాసం చేశారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కె. దధ్వాల్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఐఐటీఎంలోని సెంటర్ ఫర్




క్లైమేట్ చేంజ్ రీసెర్చ్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సువర్ణ ఫడ్నవీస్ సమావేశ లక్ష్యాలను వివరించారు.

దేశానికి వాతావరణ సేవల సమాచార వ్యవస్థ అవసరంపై ప్రపంచ వాతావరణ సంస్థలోని క్లైమేట్ అప్లికేషన్స్ అండ్ సర్వీసెస్ విభాగం మాజీ అధిపతి డాక్టర్ రూపా కుమార్ కొల్లి ప్రసంగించారు. విధాన నిర్ణయాలకు ఉపయోగపడే వాతావరణ మార్పుల సమాచారం అవసరమని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ శాస్త్రవేత్త అమర్‌దీప్ రాజు వివరించారు. వాతావరణ నమూనాలు, గణాంకాలు, పరిశోధన ఆధారిత సమాచార ఉత్పత్తులపై సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ స్వప్న పనిక్కల్ అవగాహన కల్పించారు.

రంగాలవారీగా నిర్వహించిన చర్చల్లో జలవనరులు, వ్యవసాయం, ఆహార భద్రత, విపత్తుల నిర్వహణ, ముప్పు తగ్గింపు అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. తీవ్రమైన వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు, కార్చిచ్చుల ప్రభావం, ప్రజారోగ్య అవసరాలపై ప్రతినిధులు చర్చించారు. పునరుత్పాదక ఇంధనాలకు మార్పు, బీమా, ఆర్థిక నష్టాల అంచనాలో వాతావరణ సమాచారం వినియోగాన్ని పరిశీలించారు.

సముద్ర ఉష్ణ తరంగాలు, సముద్ర జీవ ఉత్పాదకత, తీరప్రాంతాల ముప్పులు, భవిష్యత్ వాతావరణ అంచనాలపైనా చర్చలు జరిగాయి. పరిశీలనల ద్వారా సేకరించిన సమాచారాన్ని ఆచరణలో ఉపయోగపడే సేవలుగా మార్చేందుకు అవసరమైన విధానాలపై అభిప్రాయాలు పంచుకున్నారు.

వివిధ రంగాల ప్రతినిధులు తమకు అవసరమైన వాతావరణ సమాచారం, క్షేత్రస్థాయి సవాళ్లు, సేవలపై అంచనాలను తెలియజేశారు. సమావేశంలో వచ్చిన సిఫార్సులు వాతావరణ శాస్త్రం, ప్రభుత్వ విధానాలు, సామాజిక అవసరాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేసేందుకు దోహదపడనున్నాయి.

భారత వాతావరణ శాఖ, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, భారతీయ రిజర్వు బ్యాంకు, ఇన్‌కాయిస్, భారత వ్యవసాయ పరిశోధన మండలి సంస్థలతోపాటు పలు రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. శాస్త్రీయంగా విశ్వసనీయమైన, వినియోగదారుల అవసరాలకు అనుగుణమైన వాతావరణ సేవల అభివృద్ధికి సీఎస్ఎస్ఐఎఫ్ ద్వారా నిరంతర సంప్రదింపులు కొనసాగించనున్నారు.

# సంగీత దర్శకుడు దేవా మృతిపై ఉపరాష్ట్రపతి సంతాపం

**'గానా' పాటలతో ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించారన్న సి.పి. రాధాకృష్ణన్**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
ప్రముఖ సంగీత దర్శకుడు దేవా మృతి పట్ల భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం తమిళ సినీ, సంగీత రంగాలకు తీరని లోటని సంతాప సందేశంలో పేర్కొన్నారు.



విలక్షణ సంగీత శైలి, ప్రజల జీవితాలు, భావోద్వేగాలను ప్రతిబింబించే ప్రసిద్ధ 'గానా' పాటలతో దేవా తమిళ చిత్ర పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు పొందారని ఉపరాష్ట్రపతి కొనియాడారు. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ భాషల్లో 400కు పైగా చిత్రాలకు సంగీతం అందించి భారతీయ సినిమాకు విశేష సేవలందించారని గుర్తుచేశారు. దేవా అందించిన మధురమైన స్వరాలు, 'గానా' సంగీతానికి చేసిన ప్రత్యేక కృషి తరతరాల సంగీతాభిమానుల హృదయాల్లో నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సినీ ప్రముఖులు, సంగీతాభిమానులకు ఉపరాష్ట్రపతి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సింగరేణి భవిష్యత్తుకు మన శ్రమే పునాది

**కార్మిక సంక్షేమం, సంస్థ విస్తరణే ప్రజా ప్రభుత్వ లక్ష్యం**
**సింగరేణీయులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షల లేఖ**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,**
అక్టోబరు 17: బతుకమ్మ, దసరా, దీపావళి పర్వదినాల సందర్భంగా సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులకు ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి సుస్థిర భవిష్యత్తు కోసం కొత్త గనుల సాధన, థర్మల్, సోలార్ రంగంలో బహుముఖ విస్తరణకు ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మారుతున్న బొగ్గు మార్కెట్‌లో పోటీని ఎదుర్కొంటూ సంస్థను మరింత సమర్థంగా తీర్చిదిద్దేందుకు కార్మికులు, ఉద్యోగులు, అధికారులు సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

భూగర్భ, ఉపరితల గనుల్లో కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ కార్మికులు వెలికితీసే బొగ్గు తెలంగాణ విద్యుత్ అవసరాలకు, రాష్ట్ర అభివృద్ధికి చోదక శక్తి అని అన్నారు. ఎల్ నినో ప్రభావం వంటి వాతావరణ సవాళ్ల వేళ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా నిరంతరంగా జరిగేలా మరింత బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మారుతున్న బొగ్గు మార్కెట్‌లో ఇతర సంస్థలతో పోటీపడాలంటే నాణ్యమైన బొగ్గును సరసమైన ధరకు అందించడం, ఉత్పాదకత పెంచడం, అనవసర ఖర్చులను తగ్గించడం అవసరమని భట్టి విక్రమార్క అన్నారు. కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, యాజమాన్యం సమన్వయంతో పనిచేయాలని, యంత్రాలను పూర్తి పని గంటలు సమర్థంగా వినియోగించాలని సూచించారు. ఉత్పత్తి



లక్ష్యాల సాధనలో భద్రతకు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదని, ప్రతి కార్మికుడు క్షేమంగా ఇంటికి చేరడమే తొలి విజయమని స్పష్టం చేశారు. 137 ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణిని భావితరాలకు మరింత బలంగా అందించేందుకు కొత్త గనుల సాధనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఒడిశాలోని నైనీ బొగ్గు గనికి అవసరమైన అనుమతులు సాధించి ఉత్పత్తి ప్రారంభించామని, తాడిచెర్ల-2 బ్లాక్‌కు మైనింగ్ లీజు పొందామని చెప్పారు. మణుగూరు ప్రకాశం ఖని ఓపెన్‌కాస్ట్-2 డిప్ సైడ్ బ్లాక్‌ను వేలం ద్వారా దక్కించుకున్నామని, సత్తుపల్లి-3, కోయగూడెం-3 బ్లాక్‌లను తిరిగి సాధించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని వివరించారు. బొగ్గుతో పాటు విద్యుత్, పునరుత్పాదక ఇంధనం, బంగారం, రాగి, ఇతర కీలక ఖనిజాల రంగాల్లోనూ సంస్థను విస్తరించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమానికి చర్యలు

కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఇటీవల నిర్వహించిన సమీక్షలో పలు ఆదేశాలు ఇచ్చినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఉద్యోగ నియామక ప్రక్రియలను వేగవంతం చేయాలని, మారు పేర్లకు సంబంధించిన సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించాలని సూచించినట్లు చెప్పారు. సింగరేణి భూముల్లో అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, కార్మికుల సొంతింటి కల నెరవేర్చేందుకు నెహ్రూ హౌసింగ్ కాలనీల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. శిథిలావస్థకు చేరిన క్వార్టర్ల స్థానంలో కొత్త నివాసాల నిర్మాణం, కార్మిక కాలనీల అభివృద్ధి, ఏరియా ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు, క్యాథ్ ల్యాబ్ సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టినట్లు వివరించారు. ఆరు నెలలకొకసారి సేఫ్టీ కిట్లు పంపిణీ చేయాలని, పెర్క్స్, అలవెన్సులపై ఆదాయపు పన్నుకు సంబంధించిన కార్మికుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి సూచించినట్లు పేర్కొన్నారు.

గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సాధించిన రూ.1,754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం, అంటే సుమారు రూ.596 కోట్లను కార్మికులకు లాభాల వాటా బోనస్‌గా పంపిణీ చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. అర్హులైన ప్రతి రెగ్యులర్ ఉద్యోగికి సగటున రూ.1,53,912 అందిందని, కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చెల్లించినట్లు చెప్పారు. సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా అందించడం వారి కృషికి ఇచ్చే గుర్తింపని అన్నారు.

"సింగరేణి విస్తరణకు అవసరమైన చొరవ తీసుకోవడం మా బాధ్యత. సంస్థను శ్రమతో, ఐక్యతతో అత్యుత్తమంగా తీర్చిదిద్దడం మీ వంతు. ఈ సంస్థను మన పూర్వీకులు కష్టపడి నిర్మించారు. దాన్ని కాపాడి, మరింత అభివృద్ధి చేసి భావితరాలకు అందించడం మనందరి ఉమ్మడి బాధ్యత" అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**యాదాద్రి భువనగిరి, అక్టోబరు16/ట్రైనెట్ న్యూస్:**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని,శనివారం రోజు రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలతో అలంకరించిన బతుకమ్మలతో కోర్టు ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి మరియు మండల న్యాయ సేవా సమితి చైర్మన్ జి.సబిత హాజరయ్యారు. అలాగే ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష,అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి,సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి దంతూరి సత్తయ్య గౌడ్ పాల్గొన్నారు. ఈ వేడుకల్లో రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఏ. మజీద్, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయస్థాన సిబ్బంది, పోలీసు అధికారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, పూల పండుగ విశిష్టతను చాటుతూ అందరూ కలిసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను ఈ సందర్భంగా చాటిచెప్పారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయస్థాన సిబ్బంది, పోలీసు అధికారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనడం ద్వారా పరస్పర స్నేహభావం, ఐకమత్యం, సోదరభావం మరింత బలపడింది. ఈ వేడుకలు ఆహ్లాదకరమైన వాతావరణంలో, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలిచాయి.



# శిశు ఆహారంలో అదనపు చక్కెరలకు అడ్డుకట్ట

**ఆరు నెలలలోపు శిశువుల ఉత్పత్తుల్లో సుక్రోజ్, ఫ్రక్టోజ్ కలపడంపై నిషేధ ప్రతిపాదన**
**ముసాయిదా సవరణ విడుదల చేసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
ఆరు నెలలలోపు శిశువుల కోసం తయారుచేసే ఆహార ఉత్పత్తుల్లో సుక్రోజ్, ఫ్రక్టోజ్ చక్కెరలను కలపడాన్ని నిషేధించాలని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రతిపాదించింది. శిశువుల పోషకాహార ప్రమాణాలను మరింత పటిష్ఠం చేసేందుకు 'ఆహార భద్రత, ప్రమాణాలు--శిశు పోషకాహార సవరణ నిబంధనలు, 2026' ముసాయిదాను అక్టోబర్ 16న కేంద్ర గెజిట్‌లో ప్రచురించింది.ప్రస్తుతం అమల్లో ఉన్న 2020 నిబంధనలు పుట్టినప్పటి నుంచి 24 నెలల వయస్సు వరకు పిల్లలకు ఉద్దేశించిన వివిధ శిశు ఆహార ఉత్పత్తుల పోషక కూర్పు, నాణ్యత, భద్రతా ప్రమాణాలను నిర్దేశిస్తున్నాయి. వీటిలో కార్బోహైడ్రేట్ల వనరులుగా లాక్టోజ్, గ్లూకోజ్ పాలిమర్లకు ప్రాధాన్యం ఉంది. అవసరమైన సందర్భాల్లో మాత్రమే నిర్దేశిత పరిమితులకు లోబడి సుక్రోజ్, ఫ్రక్టోజ్‌లను కలిపేందుకు ప్రస్తుత నిబంధనలు అనుమతిస్తున్నాయి.తాజా ముసాయిదాలో ఆరు నెలలలోపు శిశువులకు ఉద్దేశించిన ఉత్పత్తుల్లో సుక్రోజ్, ఫ్రక్టోజ్‌లను కలపకూడదనే ప్రత్యేక నిబంధనను ప్రతిపాదించారు. జీవితంలోని తొలి ఆరు నెలలు ఎదుగుదల, వికాసానికి కీలకమైనందున, ఆ వయస్సుకు తగిన పోషక అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తుల తయారీ ఉండాలన్నది ఈ చర్య ఉద్దేశమని ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది.చిన్న వయస్సులోనే అదనపు చక్కెరలకు అలవాటుపడటంతో ముడిపడిన ఆహారపరమైన ముప్పులు, బాల్య ఊబకాయం తదితర ఆరోగ్య సమస్యలపై విస్తృత ప్రజారోగ్య చర్యలకు ఈ ప్రతిపాదన తోడ్పడనుందని పేర్కొంది. తొలి ఆరు నెలలు శిశువులకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలనే ప్రజారోగ్య సిఫార్సులకు అనుబంధంగా ఈ ప్రమాణాలను బలోపేతం చేస్తున్నట్లు వివరించింది.

60 రోజుల్లో అభ్యంతరాలు, సూచనలకు అవకాశం
ఈ ప్రతిపాదన ప్రస్తుతం ప్రజాభిప్రాయ సేకరణ దశలో ఉంది. నోటిఫికేషన్‌తో కూడిన అధికారిక గెజిట్ ప్రతులు ప్రజలకు అందుబాటులోకి వచ్చిన తేదీ నుంచి 60 రోజుల్లో సంబంధిత వర్గాలు తమ అభ్యంతరాలు, సూచనలు సమర్పించవచ్చు. నిర్ణీత గడువులో అందిన అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం ఎఫ్ఎస్ఎస్ఏఐ సవరణపై తుది నిర్ణయం తీసుకోనుంది.

# ఆడబిడ్డలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

**సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**




సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజలకు, ప్రత్యేకించి ఆడబిడ్డలకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ప్రతీక, ప్రకృతి, ఆడబిడ్డల ఆరాధనకు బతుకమ్మ పండగ నిలువెత్తు నిదర్శనమని అన్నారు.

ప్రకృతి, పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు మన తెలంగాణ అని చెప్పారు. తీరొక్క పూలతో చేసిన, ఘనమైన బతుకమ్మలతో ఆడ బిడ్డలందరూ ఆట పాటలతో సద్దుల బతుకమ్మ సంబురాలు జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

ఈ పూల పండుగ ప్రతి ఇంటా ఆనందాల పూలవాన కురిపించాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని, తెలంగాణ సంస్కృతి వైభవం తరతరాల పాటు నిలవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఈ పండుగ ప్రజల సాంస్కృతిక వైభవం, మహిళల ఐక్యతను చాటి చెప్పడంతో పాటు, అనేక సామాజిక అంశాలతో నిండి ఉందన్నారు. రాష్ట్ర మంతా బతుకమ్మ పండుగను తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం హర్షణీయమని అన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రజా ప్రభుత్వం అందజేస్తూ ముందుకు సాగుతుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

# గ్లోబల్ సమ్మిట్ లో ప్రముఖులందరూ పాల్గొనేలా చూడాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరిగే తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం సచివాలయంలో జరిగిన సమావేశంలో సమీక్షించారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన సన్నాహాలు, ముఖ్యంగా కీలక భాగస్వాములకు ఆహ్వానాలు పంపించడం, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడటంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశంలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి, అలాగే దానికి ముందస్తు కార్యక్రమాలుగా హైదరాబాద్‌లో ఈ నెల 24న, న్యూఢిల్లీలో ఈ నెల 29న నిర్వహించనున్న కార్యక్రమాలకు ఆహ్వానాల పంపిణీ స్థితిగతులను ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. ఈ రెండు కార్యక్రమాలకు సంబంధించి ఆహ్వానాలు పంపించినట్లు అధికారులు ఆయనకు వివరించారు.

ఏరోస్పేస్, అంతరిక్షం, రక్షణ రంగాలకు చెందిన సంబంధిత భాగస్వాములందరినీ ఈ రెండు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆహ్వానించాలని ప్రధాన కార్యదర్శి సంబంధిత అధికారులను



ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాల సాధనకు దోహదపడేలా ప్రముఖ పారిశ్రామిక ప్రతినిధులు, ఆయా రంగాల నిపుణులు, ఇతర ప్రముఖ వ్యక్తులను ఆహ్వానించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.

వివిధ దేశాల రాయబారులతో పాటు, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కి ), అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్ ), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ ) వంటి ప్రముఖ పారిశ్రామిక సంఘాల ప్రతినిధులను, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులను కూడా ఆహ్వానించాలని అధికారులకు సూచించారు.

ప్రముఖులందరూ కార్యక్రమాల్లో పాల్గొనేలా ఆహ్వానాల ప్రక్రియను పకడ్బందీగా, సమగ్రంగా చేపట్టాలని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు తమ బాధ్యతగా భావించి, సంబంధిత భాగస్వాములతో సమన్వయం చేసుకుంటూ, ఆహ్వానితుల భాగస్వామ్యాన్ని నిర్ధారించేందుకు సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

హైదరాబాద్, న్యూఢిల్లీలలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాలు నిర్దేశిత లక్ష్యాలను సాధించడంతో పాటు, పారిశ్రామిక రంగ ప్రముఖులు, అంతర్జాతీయ ప్రతినిధులు, ఇతర కీలక భాగస్వాముల మధ్య ఆశించిన స్థాయిలో పరస్పర భాగస్వామ్యం, చర్చలు జరిగేలా సూక్ష్మస్థాయి ప్రణాళికలు, సమర్థవంతమైన సమన్వయం అవసరమని ఆయన పునరుద్ఘాటించారు.

# పోలవరంలో ముగిసిన విదేశీ నిపుణుల పర్యటన

**నాలుగు రోజుల్లో 40 గంటల పర్యటన..**
**నిర్మాణ నాణ్యతలో నిర్లక్ష్యం వద్దు.. ప్రతి పరీక్షా ఫలితాన్ని నమోదు చేయాలి**
**నిపుణులను సత్కరించిన పీపీఏ సీఈఓ సంజీవ్ వోహ్రా**



**పోలవరం, ట్రైనెట్ న్యూస్,**
అక్టోబర్ 17: పోలవరం ప్రాజెక్టులో అంతర్జాతీయ నిపుణుల నాలుగు రోజుల పర్యటన ముగిసింది. ఈ నెల 14 నుంచి 17 వరకు ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించిన నిపుణులు.. కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ నిర్మాణ పనులు, నాణ్యతా నియంత్రణ పరీక్షలను పరిశీలించారు. గ్యాప్–1, 2 నిర్మాణాల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించారు. నిర్మాణ నాణ్యత, పరీక్షల నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగు రోజుల పర్యటనలో మొత్తం 40 గంటలపాటు ప్రాజెక్టు పనులపై దృష్టి సారించిన నిపుణులు.. 13 గంటలు క్షేత్రస్థాయి పరిశీలనకు, 27 గంటలు సమీక్షా సమావేశాలకు కేటాయించారు. రిచర్డ్ డొనెల్లీ, గ్లాన్‌ఫ్రాంకో డి సిక్కో, సీన్ హించ్‌బెర్గర్, డేవిడ్ పాల్ ఈ పర్యటనలో పాల్గొన్నారు. తొలి రెండు రోజులు కేంద్ర జలసంఘం డిజైన్స్ విభాగం చీఫ్ ఇంజినీర్ సరబ్జిత్ సింగ్ బక్షి, నేషనల్ వాటర్ సిస్టం డైరెక్టర్ పన్నీర్ సెల్వం, ఉప సంచాలకులు అశ్వనీకుమార్ వర్మ, గౌరవ్ తివారీ, సహాయ సంచాలకుడు హేమంత్ గౌతమ్.. సీఎస్ఎంఆర్ఎస్ శాస్త్రవేత్తలు షాహిద్ నూర్, ఎం.కె. బాషా, ఉదయ్ భాను చక్రబోర్తి, వ్యాప్కోస్ జనరల్ మేనేజర్ కేపీఎస్ త్యాగీ కూడా సమీక్షలు, క్షేత్రస్థాయి పరిశీలనల్లో పాల్గొన్నారు.
పీపీఏ సీఈఓ సంజీవ్ వోహ్రా, సభ్య కార్యదర్శి ఎం. రఘురాం, ఉప సంచాలకుడు ఏ. ప్రవీణ్, చీఫ్ ఇంజినీర్ ఎం. రమేష్‌కుమార్, సహాయ సంచాలకుడు సీహెచ్ సంజీవ్, రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ కె. నరసింహమూర్తి, చీఫ్ ఇంజినీర్ కె. శేషుబాబు, ఎస్ఈలు పి. రామచంద్రరావు, డి. తిరుమలరావు, ఈఈలు డి. శ్రీనివాస్, ప్రేమ్‌చంద్, కె. బాలకృష్ణమూర్తి, ఎంఈఐఎల్ జనరల్ మేనేజర్ ఏవీ గంగాధర్‌కుమార్, డీజీఎం మురళి పమ్మి, కోఆర్డినేటర్ ఠాగూర్ చంద్ పర్యటన, సమీక్షల్లో పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు జరిగిన సమీక్షా సమావేశాలకు వోహ్రా అధ్యక్షత వహించారు.

**గ్యాప్-1, 2 నిర్మాణాల పరిశీలన**
పర్యటనలో భాగంగా నిపుణులు ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌లోని గ్యాప్–1, 2 నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలోని నాణ్యతా నియంత్రణ పరీక్షా కేంద్రాలను సందర్శించి, అక్కడ నిర్వహిస్తున్న పరీక్షల విధానాన్ని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పరీక్షలు జరిపి నిర్మాణ పనుల నాణ్యతను అంచనా వేశారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణం, పరీక్షల నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసీఆర్ఎఫ్‌తో పాటు ఇతర నిర్మాణాల్లో సాంకేతికత వినియోగం బాగుందని పేర్కొన్నారు.

**నాణ్యతలో రాజీ వద్దు**
పర్యటన చివరి రోజైన శనివారం ఉదయం 9 గంటలకు ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్న నిపుణులు.. పీపీఏ, రాష్ట్ర జలవనరుల శాఖ, ఎంఈఐఎల్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. తొలి మూడు రోజుల పర్యటనలో పరిశీలించిన అంశాలను వివరించారు. అనంతరం పీపీఏ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై తమ పరిశీలనలోని కీలక అంశాలను తెలియజేశారు.
ప్రస్తుతం వర్షాలు అంతగా లేకపోవడంతో నిర్మాణ పనుల వేగాన్ని పెంచాలని సూచించారు. అదే సమయంలో నాణ్యత విషయంలో ఎలాంటి అశ్రద్ధ చేయరాదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు అనుసరిస్తున్న నాణ్యతా పరీక్షల విధానాన్ని కొనసాగించాలని, ప్రతి చిన్న అంశాన్నీ రికార్డుల రూపంలో భద్రపరచాలని సూచించారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో.. వచ్చే ఏడాది మార్చిలో మరోసారి పోలవరంలో పర్యటిస్తామని నిపుణులు సూచనప్రాయంగా తెలిపారు.

**సమన్వయంతో పర్యటన విజయవంతం**
విదేశీ నిపుణుల పర్యటనను పీపీఏ సీఈఓ సంజీవ్ వోహ్రా, రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్‌సీ కె. నరసింహమూర్తి సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. నిపుణులు అడిగిన ప్రశ్నలకు అధికారులు పూర్తిస్థాయిలో సమాచారం అందించారు. పర్యటనలో పాల్గొన్న అంతర్జాతీయ నిపుణులతో పాటు కేంద్ర, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులను పీపీఏ సీఈఓ సంజీవ్ వోహ్రా శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. సంజీవ్ వోహ్రాను రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్‌సీ కె. నరసింహమూర్తి సత్కరించారు.

# భక్తిశ్రద్ధలతో మహా చండీ హోమం



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఔషపూర్ శ్రీశ్రీశ్రీ అమ్మ దుర్గ భవాని అమ్మవారి ఆలయంలో మహా చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తులు హోమ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పుష్పాలతో అలంకరించిన అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.
దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారికి అభిషేకం, విశేష అలంకరణ, ఒడి బియ్యం సమర్పణ, మహా నైవేద్య నివేదన నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక ధర్మకర్త దేవులపల్లి శైలజ జ్యోతికుమార్ తెలిపారు. భక్తులు ఈ పూజల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో క్షేత్ర పర్యటన

**కాలీఫ్లవర్, షేడ్ నెట్ హౌస్, పత్తి పంటలను పరిశీలించిన వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ సురేంద్రమోహన్**
**ఎల్‌నినో నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి**
**యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు, స్ప్రింక్లర్ ద్వారా సేద్యం చేయాలి**
**ఉద్యాన శాఖ ద్వారా డ్రిప్ పరికరాలు, సబ్సిడీ విత్తనాలు అందజేయాలని ఆదేశం**





**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,**
అక్టోబర్ 17: వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ మరియు వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్రమోహన్ ఐఏఎస్ శనివారం సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేశారు.
కోదాడ మండలంలో కాలీఫ్లవర్ అంత క్షేత్ర సందర్శన
సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండ గ్రామంలో కాలీఫ్లవర్ సాగు చేస్తున్న రైతుల క్షేత్రాలను స్వయంగా పరిశీలించారు. రైతు ఖాజామియా 6 ఎకరాల్లో కాలీఫ్లవర్ సాగు చేస్తున్నారు.
ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ పంటలు సాగు చేయాలని సూచించారు. ఉద్యాన శాఖ ద్వారా రైతులకు డ్రిప్ పరికరాలు, సబ్సిడీ విత్తనాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. యాసంగి సీజన్‌లో రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలను స్ప్రింక్లర్ సేద్య పద్ధతిలో సాగు చేసుకోవాలని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులపై రైతు వేదికల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా రైతులు తమకు సబ్సిడీపై విత్తనాలు అందజేయాలని కోరారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి స్వయంగా పొలాలను సందర్శించి సూచనలు చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.
కొర్లపహాడ్‌లో షేడ్ నెట్ హౌస్ సందర్శన
నల్గొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ గ్రామంలో సమీకృత ఉద్యానాభివృద్ధి మిషన్ పథకం కింద ఏర్పాటు చేసిన షేడ్ నెట్ హౌస్‌ను పరిశీలించారు. రైతు ఆలం మౌనిక ఈ షేడ్ నెట్ హౌస్‌లో ఆకుకూరలు, ఉల్లిని సాగు చేస్తున్నారు.
అలాగే గ్రోబ్యాగుల్లో అల్లం, పసుపు పంటలను ఒక్కో పంటకు 13,500 మొక్కలను పెంచుతున్నారు. పసుపులో మేఘాలయ రకం, అల్లంలో రియో డి జెనీరో రకం సాగు చేస్తున్నారు .ఆర్వో ప్లాంట్ ద్వారా ఫెర్టిగేషన్ పద్ధతిలో పోషకాలు అందిస్తున్నారు.
రైతులు మౌనిక, హారిక ఇద్దరూ ఏడాది కాలంగా ఈ సాగు చేస్తున్నారు. ఈ యూనిట్‌కు సంబంధించిన ప్రతిపాదనలు ఎంఐడీహెచ్
పథకానికి పంపినట్లు అధికారులు తెలిపారు. కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి అధికారులకు సూచించారు.
ఆరెగూడెంలో పత్తి క్షేత్రాల పరిశీలన
యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామంలో పత్తి పంట క్షేత్రాలను సందర్శించారు. రైతులతో ముచ్చటించి, పంట పరిస్థితి, సాగులో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనల్లో ఆయా జిల్లాల జిల్లా వ్యవసాయ అధికారులు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**- తెలంగాణ సంస్కృతి, ప్రకృతి ఆరాధనకు బతుకమ్మ ప్రతీక**
**- గౌరమ్మ ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్ష**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,**
అక్టోబరు 17: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవానికి, ప్రకృతి ఆరాధనకు, మహిళా శక్తికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పూలతో బతుకమ్మను అలంకరించి గౌరమ్మను ఆరాధించడం ప్రకృతితో మనకున్న విడదీయరాని అనుబంధానికి ప్రతీక అని గవర్నర్ పేర్కొన్నారు. ఈ పండుగ ప్రజల్లో భక్తిభావాన్ని, సాంస్కృతిక వారసత్వం పట్ల గౌరవాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందిస్తుందని తెలిపారు. గౌరమ్మ దీవెనలతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలు కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు.

# దేశ భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పోరాటం

**ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీ గౌడ్**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
ప్రస్తుతం భారతదేశం అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిలో ఉందని.. అందరూ కలిసి కట్టుగా పోరాటం చేయాలని ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు.శనివారంమీడియాతో మాట్లాడుతూ.. 2014లో మోదీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ రక్షణ కోసం 2017లో రాహుల్ గాంధీ ప్రొఫెషనల్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. రాజ్యాంగాన్ని రక్షించాలంటే ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పాత్ర కీలకమని చెప్పుకొచ్చారు. ఇతర పార్టీలో ఉన్న వారు కూడా ప్రొఫెషనల్ కాంగ్రెస్‌లో భాగం పంచుకోవచ్చని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సభ్యత్వంలేని వారు కూడా రాజ్యాంగ పరిరక్షణ కోసం పని చేయొచ్చని అన్నారు.దేశంలో 'సర్'ద్వారా 13 కోట్ల ఓట్లను మోదీ ప్రభుత్వం తొలగించిందని మధుయాష్కీ ఆరోపించారు. 13 కోట్ల ఓట్లలో ఎక్కువ మంది దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓట్లు ఉన్నాయన్నారు. తొలగించిన 13 కోట్ల ఓట్లు ఆధారాలతో బయటపెట్టామని అన్నారు. సర్ పై పోరాటం కాంగ్రెస్ భవిష్యత్తు కోసం కాదని.. దేశ ప్రజల భవిషత్తు కోసమని స్పష్టం చేశారు. బీజేపీ మోదీ ప్రభుత్వం పౌరుల స్వేచ్ఛను కాలరాస్తోందని విమర్శించారు. క్లిష్ట సమయంలో తనకు అప్పజెప్పిన ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు.
మనోహ్మన్ సింగ్ ఫెలోషిప్ ద్వారా వివిధ రంగాల్లో వచ్చిన నిష్ణాతులైన 50 మందికి ఒక సంవత్సరం పాటు ట్రైనింగ్ ఇచ్చారని మాధుయాష్కీ తెలిపారు. రెండో దఫా 800 అప్లికేషన్స్ వచ్చాయని.. 100 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. బారిస్టర్లు, లాయర్లు, డాక్టర్లతో ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఏర్పడిందన్నారు. భారత పౌరులకు రక్షణ కల్పించేది రాజ్యాంగమన్నారు. ప్రొఫెషనల్స్‌కు క్రెడిబులిటి ఉండాలని రాహుల్ గాంధీ ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకరావడంలో ప్రొఫెషనల్స్ కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఇప్పుడున్న క్లిష్ట పరిస్థితుల కోసం ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పని చేస్తోందన్నారు. ప్రజలకు, ప్రతి పౌరుడికి గౌరవ ప్రదమైన జీవితం అందించడానికి ప్రొఫెషనల్ కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందని తెలిపారు. నిష్ణాతులతో ప్రొఫెషనల్ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు చేశామని మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు.

# శిక్షణలో ఉన్న సివిల్ సర్వీసెస్ అధికారుల కోసం ప్రత్యేక వారసత్వ పర్యటన




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,**
అక్టోబర్ 17: తెలంగాణ ప్రభుత్వ పర్యాటక, వారసత్వ శాఖ ఆధ్వర్యంలో శిక్షణలో ఉన్న సుమారు 170 మంది సివిల్ సర్వీసెస్ అధికారుల కోసం శనివారం ప్రత్యేక వారసత్వ పర్యటన నిర్వహించారు. ఈ పర్యటన చారిత్రక కట్టడం చార్మినార్ వద్ద ప్రారంభమై, ప్రసిద్ధ చారిత్రక భవనం చౌమహల్లా ప్యాలెస్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా అధికారులు హైదరాబాద్ నగర చరిత్ర, విశిష్ట నిర్మాణ శైలి, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని తెలుసుకునే అవకాశం లభించింది. హైదరాబాద్ నగర సాంస్కృతిక గుర్తింపులో ఈ చారిత్రక కట్టడాల ప్రాధాన్యతను, వాటి చారిత్రక నేపథ్యాన్ని శిక్షణలో ఉన్న అధికారులకు వివరించారు.
తెలంగాణ రాష్ట్రంలోని చారిత్రక, సాంస్కృతిక సంపదపై అవగాహన కల్పించడంతో పాటు, రాష్ట్ర పర్యాటక ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు అధికారులకు అవగాహన కల్పించారు.

# తెలంగాణ మానవ హక్కుల కమిషన్‌లో ఘనంగా దుర్గాపూజ, బతుకమ్మ వేడుకలు



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17 :**
దసరా పండుగను పురస్కరించుకొని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో శనివారం గృహకల్ప కాంప్లెక్స్, ఎం.జె. రోడ్, నాంపల్లి, హైదరాబాద్‌లో దుర్గాపూజ మరియు బతుకమ్మ వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన దుర్గాపూజలో అధికారులు, సిబ్బంది పాల్గొని, లోకకల్యాణం, శాంతి, సౌభాగ్యం ప్రజలందరి శ్రేయస్సు కోసం అమ్మవారి ఆశీస్సులు కోరారు. నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు
తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యురాలు – శివాడి ప్రవీణ, సభ్యుడు – డా. బి. కిషోర్, కమిషన్ కార్యదర్శి సీఈఓ లు సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మొహమ్మద్ షహాబుద్దీన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి. శ్రీనివాస్ రావు, పీఆర్వో రాములు, డీఎస్పీ, తదితర గెజిటెడ్ నాన్–గెజిటెడ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దుర్గి లో అక్రమ బెల్ట్ షాప్ పై పోలీసులు దాడి ఒకరి అరెస్టు మద్యం స్వాధీనం

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
దుర్గి మండల కేంద్రంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేసి గొంది వెంకయ్య అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బి. గోపాల్ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 8 క్వార్టర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మద్యం అక్రమ విక్రయాలు, బెల్ట్ షాపుల నిర్వహణపై నిఘా ముమ్మరం చేశామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఈ సందర్భంగా హెచ్చరించారు.



# సరస్వతీ దేవికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి శ్రీధర్‌బాబు

- వేయి స్తంభాల ఆలయంలో సరస్వతీ దేవి రూపంలో రుద్రేశ్వరి అమ్మవారు





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
చారిత్రక శ్రీ రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల దేవాలయంలో శ్రీ రుద్రేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఏడవ రోజుకు చేరుకున్నాయి.మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉదయం నిత్యాహ్నిక కార్యక్రమాలు, చతుస్నానార్చన, కాళరాత్రి దుర్గ అర్చన, రక్తబీజ సంహారానికి సంబంధించిన దుర్గార్చన, సరస్వతీ దేవి అర్చనలు నిర్వహించారు.తెల్లని పట్టు వస్త్రాలు ధరించి, వీణ, దండ, కమండలం, అక్షమాలతో అభయముద్రలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే సరస్వతీ దేవిని మూలా నక్షత్రం నుంచి విజయదశమి వరకు విశేషంగా పూజించడం ఆనవాయితీ. అమ్మవారిని ఆరాధించడం వల్ల విద్యార్థులకు విద్య, జ్ఞానం, బుద్ధి లభిస్తాయని భక్తుల విశ్వాసం.యాగశాలలో శాక్త అద్వైత సంప్రదాయాన్ని అనుసరించి నవదుర్గ, మహాదుర్గ పూజలతో పాటు సరస్వతీ సూక్త పారాయణం, శతచండీ యాగం, మహాచండీ యాగం నిర్వహించారు. అనంతరం చతురస్త వాహన సేవ చేపట్టారు.ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కంచి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పట్టు వస్త్రాలను మంగళవాయిద్యాలు, పూర్ణకుంభ స్వాగతం, వేదమంత్రోచ్ఛారణల నడుమ ఆలయంలోకి తీసుకువచ్చి సరస్వతీ దేవికి సమర్పించారు. అనంతరం శ్రీ రుద్రేశ్వర స్వామివారికి లఘు రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ నాట్యమండపంలో ఈవో డి.అనిల్‌కుమార్, ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ మంత్రికి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు.వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత తెలంగాణలో వరంగల్ రెండో రాజధాని స్థాయిలో అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. సుమారు వెయ్యి సంవత్సరాల క్రితమే కాకతీయులు ప్రజల అవసరాలను గుర్తించి తాగునీరు, సాగునీటి కోసం అనేక జలాశయాలను నిర్మించారని, ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ప్రజలు ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని, ఆధ్యాత్మికతతో అశాంతి తొలగి మనశ్శాంతి లభిస్తుందని అన్నారు.వరంగల్ నగరానికి విమానాశ్రయం రావడం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలతో నగరం మరింత పురోగమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో కరువు మండలాలపై సర్వే నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు.తమ ప్రభుత్వం రైతుల పక్షాన నిలుస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు పల్లం రమేష్, తౌటి రెడ్డి రవీందర్‌రెడ్డి, కోన శ్రీకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే టీఆర్ఎస్ నాయకులు దుగ్గంపూడి రంజిత్‌రెడ్డి, మారిశెట్టి వరుణ్ తదితరులు అమ్మవారి పూజా కార్యక్రమాల్లో

# హుస్నాబాద్‌లో స్విమ్మింగ్ పూల్

---వాటర్ స్పోర్ట్స్ మౌలిక వసతులకు ఆదేశాలు

---మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో దసరా కానుక


GOVERNMENT OF TELANGANA
ABSTRACT
Establishment - Youth Advancement, Tourism and Culture Department - Sports Authority of Telangana - Permission for engaging of twenty-nine (29) various categories of services on outsourcing basis, to work in New Swimming Pool and Other Water Sports Infrastructure in Husnabad Constituency, Siddipet District under the administrative control of the Vice-Chairman and Managing Director, Sports Authority of Telangana, Hyderabad for a period up to 31.03.2027 - Accorded - Orders - Issued.

FINANCE (HRM.VII) DEPARTMENT

G.O.Rt.No.1673 Dated: 17th October, 2026.
Read the following:-

1. G.O.Rt.No.4271, Finance (SMPC) Department, dated:01.11.2008.
2. G.O.Ms.No.60, Finance (HRM.VII) Department, dated:11.06.2021.
3. G.O.Ms.No.63, Finance (HRM.VII) Department, dated:15.06.2021.
4. From the VC & MD, Sports Authority of Telangana, Hyderabad Letter No. SATG/Infra/3970/2024, dated:09.10.2025 and dated: 07.11.2025.
5. Youth Advancement Tourism Technology (Sports) Department, U.O.No.141/ Sports/2024, dated:16.10.2026.

&&&

ORDER:

In the circumstances as stated by Youth Advancement, Tourism and Culture (Sports) Department, vide reference 7th read above, and after examination of the proposal, Government hereby accord permission for engaging twenty-nine (29) various categories of new services on outsourcing basis, as shown in Annexure, appended to this order, to work in New Swimming Pool and Other Water Sports Infrastructure at Husnabad Constituency, Siddipet District under the administrative control of Vice Chairman and Managing Director (VC&MD), Sports Authority of Telangana, Hyderabad, for a period up-to 31.03.2027 or till the actual need ceases, whichever is earlier, subject to;

a. Engaging of the services on contract / outsourcing basis shall be strictly in accordance with the norms and guidelines prescribed in the Government orders issued vide reference 1st read above
b. The remuneration shall be paid as shown in Column No.5 of the Statement in Annexure, appended to this order, with a condition to pay the same through a

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
(కోహెడ ప్రసాదరావు): హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో హుస్నాబాద్‌లో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. అత్యాధునిక స్విమ్మింగ్ పూల్‌తో పాటు స్టేడియం సమీపంలోని చెరువు వద్ద ఏర్పాటు చేసిన వాటర్ స్పోర్ట్స్ మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అనుమతినిస్తూ ఆర్థిక శాఖ జీవో ఆర్టి నంబరు.1673, తేదీ: 17.10.2026 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది.
స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ( ఎస్ ఏ టి జి) పర్యవేక్షణలో ఈ క్రీడా కేంద్రాలను నిరంతరం అందుబాటులో ఉంచడంతో పాటు, క్రీడాకారులకు నాణ్యమైన శిక్షణ, భద్రతతో కూడిన సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బంది నియామకం, నిర్వహణ ఏర్పాట్లకు ప్రభుత్వం అనుమతించింది.రెండు రోజుల క్రితమే హుస్నాబాద్‌కు కబడ్డీ అకాడమీ మంజూరు కాగా, తాజాగా స్విమ్మింగ్ పూల్, వాటర్ స్పోర్ట్స్ మౌలిక వసతుల నిర్వహణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా క్రీడా వసతులు అందుబాటులోకి వస్తుండటంతో హుస్నాబాద్ ప్రాంతం క్రీడా కేంద్రంగా అభివృద్ధి చెందే దిశగా అడుగులు వేస్తోంది.ఈ సదుపాయాల ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువత, క్రీడాకారులకు ఈతతో పాటు రోయింగ్, కనోయింగ్ వంటి వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ పొందేందుకు మెరుగైన అవకాశాలు లభించనున్నాయి. స్థానికంగానే నాణ్యమైన క్రీడా వసతులు అందుబాటులోకి రావడం వల్ల యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెరగడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేందుకు దోహదపడనుంది.
హుస్నాబాద్ నియోజకవర్గాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నియోజకవర్గ ప్రజలు, విద్యార్థులు, యువత, క్రీడాభిమానులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి,

- మంచిర్యాలజిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగుల సంఖ్య, వ్యాధుల వివరాలు, మందుల లభ్యత, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించి ఆసుపత్రికి ప్రతిరోజూ వస్తున్న రోగులు, నమోదు అవుతున్న వ్యాధులు, చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. దగ్గు, జలుబు, జ్వరాలతో పాటు డెంగ్యూ లక్షణాలతో వస్తున్న రోగుల వివరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ఆసుపత్రిలో అవసరమైన మందులు సరిపడా అందుబాటులో ఉంచాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలోని ల్యాబ్‌ను సందర్శించి పరీక్షల నిర్వహణ, రోగుల వివరాల నమోదు, రిజిస్టర్ల నిర్వహణ అంశాలను పరిశీలించి, ఆసుపత్రికి వస్తున్న రోగుల వివరాలను క్రమబద్ధంగా నమోదు చేయాలని, వ్యాధులపై సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, ఆహార నాణ్యత తదితర అంశాలపై ఆరా తీశారు. డెంగ్యూ లక్షణాలతో ఆసుపత్రికి వస్తున్న రోగులు ఏ ప్రాంతాలకు చెందినవారో గుర్తించి, ఆయా ప్రాంతాలలో త్రాగునీటి నాణ్యతను పరీక్షించడంతో పాటు వ్యాధుల వ్యాప్తికి దారితీసే పరిస్థితులను గుర్తించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో త్రాగునీటి సరఫరాకు సంబంధించి సమస్యలు ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ తో వెంటనే నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు సరఫరా చేస్తున్న త్రాగునీటి నాణ్యతను నిర్ధారించేందుకు 10వ వార్డుతో పాటు పట్టణంలోని అన్ని వార్డులలోనూ నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. డెంగ్యూ కేసులు నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, వివరాలను సమగ్రంగా పరిశీలించాలని వైద్యులకు సూచించారు. మున్సిపల్ అధికారులు అన్ని వార్డులలో త్రాగునీటి పరీక్షలు నిర్వహించడంతో పాటు మురుగు కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. దోమల వృద్ధికి అనుకూలమైన పరిస్థితులను నివారిస్తూ, ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన పారిశుద్ధ్య చర్యలను నిరంతరం చేపట్టాలని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించడం, అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టడం, ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు

# ఆటో డ్రైవర్ కుటుంబానికి పోలీస్ ఆపన్నహస్తం:ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆలీ మహమ్మద్



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
అనారోగ్యంతో మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆలీ మహమ్మద్ ఆపన్నహస్తం అందించారు.హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన జంగం రాజు 19 రోజుల క్రితం కిడ్నీ సంబంధిత సమస్యలు, ఇతర అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.రాజుకు భార్యతో పాటు మూడేళ్ల పాప, చిన్నబాబు ఉన్నారు. కుటుంబానికి జీవనాధారమైన రాజు మృతి చెందడంతో భార్యాపిల్లలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకోవడం కూడా కష్టంగా మారింది.ఈ విషయం తెలుసుకున్న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆలీ మహమ్మద్ శనివారం జంగం రాజు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను, భార్యాపిల్లలను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పడంతో పాటు రూ.3,000 విలువైన నిత్యావసర సరుకులను అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు.ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఈ కుటుంబాన్ని దాతలు, దయార్ద్ర హృదయులు ముందుకు వచ్చి ఆదుకోవాలని ఆలీ మహమ్మద్ విజ్ఞప్తి

# ఆటో డ్రైవర్ కుటుంబానికి పోలీస్ ఆపన్నహస్తం:ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆలీ మహమ్మద్

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
అనారోగ్యంతో మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆలీ మహమ్మద్ ఆపన్నహస్తం అందించారు.హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన జంగం రాజు 19 రోజుల క్రితం కిడ్నీ సంబంధిత సమస్యలు, ఇతర అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.రాజుకు భార్యతో పాటు మూడేళ్ల పాప, చిన్నబాబు ఉన్నారు. కుటుంబానికి జీవనాధారమైన రాజు మృతి చెందడంతో భార్యాపిల్లలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకోవడం కూడా కష్టంగా మారింది.ఈ విషయం తెలుసుకున్న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆలీ మహమ్మద్ శనివారం జంగం రాజు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను, భార్యాపిల్లలను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పడంతో పాటు రూ.3,000 విలువైన నిత్యావసర సరుకులను అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు.ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఈ కుటుంబాన్ని దాతలు, దయార్ద్ర హృదయులు ముందుకు వచ్చి ఆదుకోవాలని ఆలీ మహమ్మద్ విజ్ఞప్తి చేశారు.



# పంట చేతికొచ్చే దశలో చీడపీడల పట్ల జాగ్రత్త

- రైతులకు వ్యవసాయ అధికారుల హెచ్చరిక





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
పంట చేతికొచ్చే దశలో సోకే చీడపీడల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని వ్యవసాయాధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు.
సిద్దిపేట జిల్లా కొహెడ మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు శనివారం క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి పంటల పరిస్థితులను పరిశీలించారు. ఈ పర్యటనల్లో మండల వ్యవసాయ అధికారి సతీష్ , వ్యవసాయ విస్తరణ అధికారులు ( ఏఈఓ) పాల్గొని వరి, పత్తి తదితర పంటల ఎదుగుదల స్థితిని, చీడపీడల ఉధృతిని పరిశీలించారు.
వరి పంటలో కొన్ని ప్రాంతాల్లో బ్రౌన్ ప్లాంట్ హాపర్ ( బి పి హెచ్) పురుగు ఉనికిని గుర్తించి, దాని నివారణకు తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు అందించారు. పంటలో పురుగు ఉధృతిని క్రమం తప్పకుండా గమనించాలని, అవసరమైనప్పుడు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.
పత్తి పంటలో రసం పీల్చే పురుగుల సముదాయం ఉనికిని గుర్తించి, వాటి నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని రైతులకు వివరించారు. పురుగుల ఉధృతిని గమనిస్తూ, అవసరమైనప్పుడు సిఫార్సు చేసిన పురుగుమందులను సరైన మోతాదులో మాత్రమే వినియోగించాలని, పురుగుమందుల మిశ్రమాలను అనవసరంగా ఉపయోగించరాదని సూచించారు.
అదేవిధంగా, వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు పంటల్లో తేమ సంరక్షణ చర్యలు చేపట్టాలని, అవసరానికి అనుగుణంగా నీటి వినియోగాన్ని నియంత్రించాలని, కలుపు మొక్కలను నివారించాలని, నేలలో తేమను కాపాడే పద్ధతులను పాటించాలని రైతులకు అవగాహన కల్పించారు.
పత్తిలో రసం పీల్చే పురుగుల ఉధృతి అధికంగా ఉన్నట్లయితే ఎసిఫేట్ 300గ్రా/ఎకరానికి లేదా ఫిప్రోనిల్ 600 ఎం.ఎల్ /ఎకరానికి లేదా థయోమిథాక్సీమ్ 80 గ్రా /ఎకరానికి పిచికారి చేసుకోవాలి, వరిలో సుడిదోమ ఉధృతి అధికంగా ఉన్నట్లయితే పైమెట్రోజిన్ 120గ్రా/ఎకరానికి లేదా ట్రైఫ్లూమెజొపైరిమ్ 100మి. లి/ఎకరానికి లేదా డినోటెఫ్యూరాన్ 80 గ్రా/ఎకరానికి పిచికారి చేసుకోవాలి.
రైతులు తమ పంటల్లో చీడపీడల లక్షణాలను గమనించిన వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి, వారి సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో రైతులు రాజు, మహేందర్, భూంరెడ్డి, మ్యాకల మహేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి దళితమోర్చా మండల అధ్యక్షుడు మాజీ సర్పంచ్ పొన్నాల శంకర్

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
బిజెపి దళిత మోర్చా మండల శాఖ అధ్యక్షులుగా మాజీ సర్పంచ్ పొన్నాల శంకర్ ను నియమించారు.
బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం, బిజెపి మండల అధ్యక్షుడు జాలిగం రమేష్ నేతృత్వంలో శుక్రవారం రోజున నూతన కార్యవర్గాన్ని నియమించారు .
కేంద్రమంత్రి బండి సంజయ్ సారథ్యంలో కోహెడ మండలంలోని షెడ్యూల్ తెగలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పోరాటం చేసేందుకు భారతీయ జనతా పార్టీ బలోపేతానికి బిజెపి దళితమోర్చా మండల కమిటీ నూతన కార్యవర్గం పనిచేస్తుందని దళితమోర్చా మండల అధ్యక్షుడి గా ఎన్నికైన మాజీ సర్పంచ్ పొన్నాల శంకర్ తెలిపారు. అలాగే ఈయనతో పాటు

| క్రమ సంఖ్య | పదవి | పేరు | గ్రామం | మొబైల్ నంబర్ |
|---|---|---|---|---|
| 1 | అధ్యక్షుడు | పొన్నాల శంకర్ | తీగలకుంటపల్లి | 7893141399 |
| 2 | ఉపాధ్యక్షుడు | మంద మధుకర్ | పోరెడ్డిపల్లి | 9959259252 |
| 3 | ఉపాధ్యక్షుడు | ధ్యాగటి సతీష్ | వింజపల్లి | 9440424357 |
| 4 | ఉపాధ్యక్షుడు | చిట్కూల శ్రీనివాస్ | కూరేళ్ల | 9440547029 |
| 5 | ఉపాధ్యక్షుడు | మ్యాదర రాజ్ కుమార్ | తంగాళ్లపల్లి | 9014403598 |
| 6 | ప్రధాన కార్యదర్శి | మారెల్ల కరుణాకర్ | బత్తులవానిపల్లి | 9573626698 |
| 7 | ప్రధాన కార్యదర్శి | తలారి బాబు | కోహెడ | 9440056520 |
| 8 | కార్యదర్శి | పొన్నాల బాబు | గొట్లమిట్ట | 9090000396 |
| 9 | కార్యదర్శి | పార్నంది బాబు | నాగ సముద్రాల | 8555028497 |
| 10 | కార్యదర్శి | తగురపు రఘు | మైసంపల్లి | 9704378044 |
| 11 | కార్యదర్శి | వేల్పుల హరీష్ | తీగలకుంటపల్లి | 8985278261 |
| 12 | కోశాధికారి | చింతల వికాస్ | బత్తులవానిపల్లి | 7670890863 |
| 13 | సోషల్ మీడియా కన్వీనర్ | ఎరవెల్లి రమేష్ | తంగాళ్లపల్లి | 9515333408 |

కార్యవర్గం సహితం నిమించారు.

# కాయకల్ప్ అవార్డ్స్ 2025--26లో మంచిర్యాల జిల్లాకు ఘన విజయం,

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
కాయకల్ప్ అవార్డ్స్ 2025--26 కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఘన విజయాన్ని సాధించిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నర్సాపూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో టి.వి.వి.పి. వైద్యాధికారులను శాలువాతో సన్మానించి, మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ కాయకల్ప్ అవార్డ్స్ 2025--26 కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి రన్నరప్‌గా నిలిచి 10 లక్షల రూపాయల నగదు బహుమతిని గెలుచుకోగా, చెన్నూరు ఏరియా ఆసుపత్రి, లక్షెట్టిపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లు కమెండేషన్ అవార్డులతో పాటు ఒక్కొక్కటి 1 లక్ష రూపాయల నగదు బహుమతిని సాధించాయని తెలిపారు. ఆసుపత్రులలో పారిశుధ్యం, పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఆసుపత్రి నిర్వహణ ప్రమాణాల మెరుగుదలకు వైద్యులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. ఈ విజయంలో 3 ఆసుపత్రుల పర్యవేక్షకులతో పాటు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కృషి అభినందనీయమని తెలిపారు. ఆసుపత్రులలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం కృషి చేయాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ 3 ఆసుపత్రుల పర్యవేక్షకులు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా : బూడిద వెంకటేష్



చంద్రపురి కాలనీ 2వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బూడిద వెంకటేష్ నియమితులయ్యారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. తనకు బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

తెలంగాణ త్రినెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
ఆదివారం అక్టోబర్ 18, 2026
www.trinetnews.com

## భద్రకాళీ ఆలయంలో ఘనంగా రథసేవ.. నేడు అమ్మవారి జన్మోత్సవం

- నూతన రథం అందజేసిన నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు
- అమ్మవారికి మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక పూజలు





**త్రినెట్ న్యూస్, అక్టోబర్ 17:**
వరంగల్ మహానగరంలోని చారిత్రక శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఏడో రోజుకు చేరుకున్నాయి.శనివారం ఉదయం నిత్యాహ్నిక పూజల అనంతరం అమ్మవారిని సరస్వతీ మాతగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకుంటే సకల విద్యలు, జ్ఞానం సిద్ధిస్తాయని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళీ శేషు తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా అమ్మవారికి ఘనంగా రథసేవ నిర్వహించారు. రథసేవలో పాల్గొని రథాన్ని లాగితే జీవిత ప్రయాణం సజావుగా సాగుతుందనే నమ్మకంతో భక్తులు ఉత్సాహంగా రథాన్ని లాగారు. నవరాత్రి కల్పం ప్రకారం కాళరాత్రి, రక్తబీజ సంహారిణి దుర్గాదేవి క్రమంలో అమ్మవారికి పూజారాధనలు నిర్వహించారు. 'భద్రకాళీ శరణం మమ' నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరులు ఉన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళీ శేషు పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో వారికి ఘనస్వాగతం పలికారు.అనంతరం అమ్మవారికి ప్రత్యేక నవరాత్రి పూజలు నిర్వహించారు.పూజల అనంతరం ఆలయ మహామండపంలో మహదాశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను బహూకరించారు.ఆలయానికి రూ.కోటితో నిర్మించిన రథం అందజేతఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు తమ బంధుమిత్రుల సహకారంతో సుమారు రూ.కోటి వ్యయంతో 27 అడుగుల ఎత్తులో తయారు చేయించిన నూతన రథాన్ని మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఆలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు కమటం వేణుగోపాల్, కల్లూరి పవన్‌కుమార్, కటకం రాములు, కారెంగుల సురేష్‌బాబు, గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, చిదర అంజనీదేవి, మాడిశెట్టి సతీష్, పేరాల శ్రీనివాసరావు, రమేష్ చంద్ భంగ్, మోతుకూరి మయూరి రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.మాజీ ధర్మకర్తలు జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్, గాండ్ల స్రవంతి, పాలడుగుల అంజనేయులు తదితరులు హాజరయ్యారు.రేపు భద్రకాళీ అమ్మవారి జన్మోత్సవం

ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా భద్రకాళీ అమ్మవారి జన్మోత్సవాన్ని నిర్వహించనున్నారు.దుర్గాభద్రకాళి కోటి యోగినీ గణాలతో ఆవిర్భవించిన పవిత్ర దినంగా దీనిని భక్తులు భావిస్తారు.దుర్గాష్టమి రోజున బతుకమ్మ పండుగలో భాగంగా సద్దుల బతుకమ్మ నిర్వహించడం తెలంగాణలో తరతరాలుగా వస్తున్న సంప్రదాయం.ప్రముఖుల దర్శనం

శనివారం అమ్మవారిని మాజీ ఎమ్మెల్సీ జోగినపల్లి సంతోష్‌కుమార్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్, నాగుర్ల వెంకటేశ్వర్లు, కె. వాసుదేవరెడ్డి తదితర ప్రముఖులు దర్శించుకున్నారు.ఈ రోజు ఉత్సవ కార్యక్రమాలకు శారదా విద్యాసంస్థల అధినేతలు సందిపూడి రవిశంకర్--మానస దంపతులు, నాగభూషణం--శ్రీదేవి దంపతులు, డాక్టర్ బి. వెంకటేశ్వర్లు--సునీత దంపతులు, డాక్టర్ బి. సనత్‌కుమార్, డాక్టర్ సాహితి దంపతులు, డాక్టర్ బి. వైష్ణవి, జోశ్యుల కామేశ్వరశర్మ--కిరణ్మయి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.ఈ వివరాలను ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత వెల్లడించారు.

## జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ మరో నల్గొండ ఫ్లోరైడ్ సమస్యలా మారింది

-డంపింగ్ యార్డ్ తరలింపుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
-దుర్వాసనతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
కార్మిక నగర్‌లో కనీస మౌలిక సదుపాయాలు కరువు
-డంపింగ్ యార్డ్ ఎత్తివేసే వరకు బీజేపీ పోరాటం
-ఏనుగు సుదర్శన్ రెడ్డి



**త్రినెట్ న్యూస్, అక్టోబర్ 17:**
మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసనతో స్థానికులు ప్రతిరోజూ నరకయాతన అనుభవిస్తున్నారని, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. డంపింగ్ యార్డ్‌ను తరలిస్తామని గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.శుక్రవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా కార్మిక నగర్‌లో బస చేసిన ఏనుగు సుదర్శన్ రెడ్డి స్థానిక పరిస్థితులను పరిశీలించి మీడియాతో మాట్లాడారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యను మరో నల్గొండ ఫ్లోరైడ్ సమస్యతో పోలుస్తూ, ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాల పరిరక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.డంపింగ్ యార్డ్‌ను తరలిస్తామని గతంలో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రస్తుతం ఈ సమస్యను పట్టించుకోవడం లేదని సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై పాలకులు చిత్తశుద్ధితో స్పందించడం లేదని విమర్శించారు. సమస్య పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించి, ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు.డంపింగ్ యార్డ్ ప్రభావంతో సుమారు 20 లక్షల మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కార్మిక నగర్‌లో నివసిస్తున్న సుమారు 8 వేల మంది ప్రజలు దుర్వాసన కారణంగా తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. స్థానికులు చర్మ వ్యాధులు, శ్వాసకోశ సమస్యలతో పాటు గుండె, కిడ్నీ, ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్య సమస్యలపై ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడకుండా సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.కార్మిక నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం, ఆసుపత్రి, పాఠశాల వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా అందుబాటులో లేకపోవడం విచారకరమని సుదర్శన్ రెడ్డి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు జవహర్ నగర్ ప్రాంత సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్థానికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తరలింపునకు చర్యలు చేపట్టాలని ఏనుగు సుదర్శన్ రెడ్డి కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని, డంపింగ్ యార్డ్ ఎత్తివేత కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కళికోట కమలాకర్, చంద్రపురి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కర్లపూడి జోగారావు, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు మహిపాల్ రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్ యాదవ్, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రామ్ నాయక్, సీనియర్ నాయకుడు సంతోష్ గుప్తా, జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు గిరికత్తుల వెంకన్న, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శులు రెడ్డిశెట్టి మాధవి, ఒరుగంటి లత, జిల్లా యువ మోర్చా కార్యదర్శి శశాంక్ సింగ్ రాహుల్, డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శులు వేపుల సన్నీ, పుల్లూరి అనిల్ కుమార్, బొమ్మ యాదగిరి, కోశాధికారి కోమకుల రాజు, మాజీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రాఘవేంద్ర చారి, నాయకులు తేలు శ్రీనివాస్, మచ్చ అశోక్, మల్లికార్జున్ గౌడ్, రామ్ లాల్ నాయక్, ఇంద్రపాల సత్యం, కనకరాజు, శాగ అనిల్, కురుమ శివప్రసాద్, అరుణ్, కార్మిక నగర్ బీజేపీ నాయకులు యాటకారి శ్రీనివాస్, ముదిరాజ్ శ్రీను, రాజేందర్ చారి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్ శాఖలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ,

- జిల్లా ఆయుష్ నోడల్ అధికారి,

**త్రినెట్ న్యూస్, అక్టోబర్ 17:**
ఆయుష్ శాఖ పరిధిలో పొరుగు సేవల పద్ధతిన వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఆయుష్ నోడల్ అధికారి జి నీరజ ఒక ప్రకటనలో తెలిపారు. 4 మెడికల్ ఆఫీసర్, 1 ఫార్మసిస్ట్, 1 సైకోసోషల్ కౌన్సిలర్ (సంవత్సరానికి కనీసం 200 సందర్శనలు), 1 యోగ ప్రొఫెషనల్, 3 మల్టీ పర్పస్ వర్కర్ (పీూఔ) పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం/ సంస్థ నుంచి ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, నేచురోపతిలో సంబంధిత విద్యార్హతతో పాటు తప్పనిసరి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలని, ఫార్మసిస్ట్ పోస్టుకు డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఫార్మా-డి అర్హతతో పాటు తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో నమోదు అయి ఉండాలని, సైకోసోషల్ కౌన్సిలర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సోషల్ వర్క్‌లో మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉండాలని, యోగ ప్రొఫెషనల్ పోస్టుకు సంబంధిత విభాగంలో నిర్దేశిత విద్యార్హతతో పాటు నేచురోపతి, యోగిక్ సైన్సెస్‌లో డిప్లొమా అర్హత ఉండాలని, మల్టీ పర్పస్ వర్కర్ పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండి, సైకిల్ / మోటార్ సైకిల్ నడపగలగాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం వర్తించే సందర్భంలో, ఇతర అవసరమైన పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. అర్హత పరీక్షలో మార్కులు, వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని, మెరిట్ లిస్ట్ వెబ్ సైట్ లో ఉంచడం జరుగుతుందని తెలిపారు, మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 28వ తేదీన సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు సమర్పించే ముందు అధికారిక నోటిఫికేషన్‌లోని పూర్తి నిబంధనలు, అర్హతలు, రిజర్వేషన్లు, ఎంపిక విధానాన్ని పరిశీలించాలని తెలిపారు.

## తాగునీటి కష్టాలు తొలగించాలని కార్యదర్శికి వినతిపత్రం ....!

-- సుమారు 70 కుటుంబాలకు తప్పని మంచినీటి కష్టాలు.




**త్రినెట్ న్యూస్, అక్టోబర్ 17:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం,జానంపేట గ్రామంలో మంచినీటి సౌకర్యం కోసం పబ్లిక్ నల్లాలు ఏర్పాటు చేస్తున్న తరుణంలో, జానంపేట శివారు ప్రాంతంలోని కొత్తగుంపు బార్డర్ వరకు నివసిస్తున్న సుమారు 60 నుంచి 70 కుటుంబాలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో మంచినీటి సమస్యను గుర్తించి పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ధర్మరాజుల శంకర్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే కుటుంబాలు, రోజంతా కష్టపడి ఇంటికి చేరిన తర్వాత కూడా తాగునీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోందని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లి మంచినీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వివరించారు. పంచాయతీ పరిధిలో పబ్లిక్ నల్లాలు ఏర్పాటు చేస్తున్నప్పుడు తమ ప్రాంతాన్ని కూడా గుర్తించి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మేదరమెట్ల శ్రీనివాసరావు, గట్టి కుమార్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి,





**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**త్రినెట్ న్యూస్, అక్టోబర్ 17:**
ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లు, ఎన్నికల విభాగం అధికారులతో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎ.ఈ.ఆర్.ఓ.లు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసే విధంగా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా కొనసాగేందుకు సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ ప్రామాణికంగా 18 సంవత్సరాలు నిండిన, అర్హత గల ప్రతి ఒక్క ఓటరు వివరాలు జాబితాలో తప్పనిసరిగా ఉండాలని, అనర్హుల వివరాలు ఖచ్చితంగా ఉండకూడదని తెలిపారు.
జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎ.ఈ.ఆర్.ఓ.లు, సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారుల సమన్వయంతో ప్రక్రియను వేగవంతం చేయడం జరుగుతుందని, ఓటర్ల నుండి సేకరించిన ధ్రువపత్రాలను నిబంధనల మేరకు పరిశీలించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఫారం 6, 7, 8 దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, పరిష్కార ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి అమ్మవారికి చల్మెడ ప్రత్యేక పూజలు



**త్రినెట్ న్యూస్, అక్టోబర్ 17:**
చందుర్తి మండలంలోని మల్యాల లింగంపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి మండపాల వద్ద బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు
మల్యాల గ్రామంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు అనంతరం లింగంపేట గ్రామంలో నిర్వహించిన కుంకుమ పూజల్లో పాల్గొని దుర్గాదేవి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు
ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని చల్మెడ ఆకాంక్షించారు దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు
ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య మాజీ పీఏసీఎస్ చైర్మన్లు జలగం కిషన్ రావు, తిప్పని శ్రీనివాస్ సర్పంచులు మందల అబ్రహం కొక్కుల నరేష్, నాయకులు దప్పుల అశోక్ బైరవని రమేష్ దుమ్ము ఆనంద్ బత్తుల కమలాకర్ పోతురాజు తిరుపతి ఆకుల ఎల్లయ్య గట్టు లక్ష్మీనారాయణ అన్నం శ్రీధర్ గాజుల సత్తయ్య గుడిసె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాలలోని గ్రామ మహిళలకు మరియు ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

**ఐటీడీఏ పీవో బి రాహుల్ మరియు సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట.**





**త్రినెట్ న్యూస్, అక్టోబర్ 17: .**
ఐటీడీఏ మరియు డివిజన్ పరిధిలోని ఆదివాసి గిరిజన గ్రామాలలో గిరిజన కుటుంబాలకు ముఖ్యంగా గిరిజన మహిళలకు, ప్రజలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట శనివారం నాడు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు.
తెలంగాణలో సద్దుల బతుకమ్మ పండుగ అనేది చాలా పవిత్రమైన పండుగని బతుకమ్మ వేడుకలు ప్రారంభమైన రోజు నుండి ప్రతిరోజు మహిళలు వివిధ అలంకరణలతో వివిధ రూపాలతో బతుకమ్మలను తయారుచేసి చిన్న పెద్ద అందరు కలిసి చాలా సంతోషంగా పాటలు పాడుతూ బతుకమ్మల ఆటలు ఆడి ఒకరినొకరు సంతోషాన్ని పంచుకుంటారని చివరి రోజు తిరొక్క పువ్వులతో బతుకమ్మను చేసి ఊరంతా ఒకచోటికి చేరి గౌరమ్మను పూజించుకునే గొప్ప పండుగని,సద్దుల బతుకమ్మ ను తయారుచేసి అందరూ ఒకచోట గుమిగూడి ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ పెద్ద ఎత్తున ఊరేగింపుతో బతుకమ్మలను నిమజ్జనం చేసి సంతోషంగా గడుపుతారని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయం పరిధిలో వివిధ శాఖలలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు వారు తెలిపారు.

## ఘనంగా కొనసాగుతున్న దుర్గా నవరాత్రి వేడుకలు



**త్రినెట్ న్యూస్, అక్టోబర్ 17:**
సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగాను ఘనంగాను కొనసాగుతున్నాయి. అశ్వీజశుద్ధ పాడ్యమి మొదలు విజయదశమి వరకు జరిగే ఈ వేడుకలను ఈ ఏడు 11వ తేదీ ఆదివారం నుండి మంగళవారం వరకు జరుగుతున్నాయి. మండలంలోని ధర్మసాగరపల్లి, కోహెడ, శ్రీరాములపల్లి, శనిగరం, బస్వాపూర్, వరి కోల్, తదితర గ్రామాలలో దుర్గా నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అన్నదానములు, కుంకుమ పూజలు, వంటి కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. శుక్రవారం మూలా నక్షత్రంతో కూడిన ఉన్నందున ఆరోజు సరస్వతి పూజలు నిర్వహించారు. విద్యార్థులు పుస్తకములను పెన్నులను అమ్మవారి విగ్రహం ముందు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలుచోట్ల కుంకుమ పూజలు జరిగాయి. సువాసినిలు తన సౌభాగ్యం కోసం కుటుంబ సంక్షేమం కోసం కుంకుమ పూజలను నిర్వహించారు. దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలతో పల్లె ప్రాంతాలలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది.

# డిండి లిఫ్ట్ ప్రాజెక్టును రద్దు చేయాలి

**•భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి**

**•మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ డిమాండ్**






**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
డిండి లిఫ్ట్ ప్రాజెక్టును వెంటనే రద్దు చేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు కారణంగా భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు రూ.50 లక్షల చొప్పున పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. పాలమూరు ప్రాంత రైతులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..

నల్లగొండ జిల్లాకు సాగర్ ఎడమ కాలువ, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు, ఎస్ఎల్‌బీసీ ద్వారా నీటిని అందించే అవకాశాలు ఉన్నాయని జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ నుంచి నక్కలగండి, మన్నెవారిపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి, సివ్వన్నగూడెం, మూసి తదితర ప్రాంతాల ద్వారా నల్లగొండ జిల్లాలోని 2.90 లక్షల ఎకరాలకు నీటిని అందించే వనరులు ఉన్నాయని తెలిపారు.డిండి పాత ప్రాజెక్టు ద్వారా లభించే నీరంతా నల్లగొండ జిల్లాకే వెళ్తున్న నేపథ్యంలో, ప్రత్యామ్నాయ నీటి వనరులను వినియోగించుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే నల్లగొండ జిల్లాకు సాగునీరు అందించేందుకు పలు మార్గాలు ఉన్నప్పుడు, పాలమూరు ప్రాంత రైతులకు నష్టం కలిగించే విధంగా డిండి లిఫ్ట్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడం సమంజసం కాదని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశాలపై సమగ్రంగా ఆలోచించి పాలమూరు ప్రాంతానికి న్యాయం చేయాలని జైపాల్ యాదవ్ కోరారు. పాలమూరు బిడ్డగా ఈ ప్రాంత రైతుల ప్రయోజనాలను కాపాడాలని, ప్రాజెక్టు విషయంలో జిల్లాకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని హితవు పలికారు.

## అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

**- ఎల్నినో ప్రభావాలను సమిష్టిగా ఎదుర్కొందాం.**

**- ఇందిరమ్మ లబ్ధిదారులను ఇసుక విషయంలో ఇబ్బంది పెట్టవద్దు.**

**- దసరా పండుగ తర్వాత ఇందిరమ్మ ఇండ్ల రెండో జాబితా.**





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
తెలంగాణ రాష్ట్రంలో మహిళా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కొనసాగుతుందని దీనిలో భాగంగా అన్ని వర్గాల వారికి ప్రభుత్వ పథకాలను అమలు చేస్తూ వారి అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతుందని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎస్టి సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సన్న బియ్యం పథకం దేశానికి రోల్ మోడల్ గా నిలిచిందని, గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా కూడా సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రేషన్ కార్డులు మంజూరయ్యాయని నేడు అదే కాంగ్రెస్ ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులను మంజూరు చేయడం జరిగిందని బి.ఆర్.ఎస్ పాలనలో నూతన రేషన్ కార్డులను మంజూరు చేయలేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి,గృహలక్ష్మి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, గ్యాస్ సబ్సిడీ, రుణమాఫీ తదితర పథకాలకు అనేక వేల కోట్ల రూపాయలను కేటాయించి సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతి ఒక్క ఓటరు మద్దతు పలకాలని కోరారు.

**- ప్రతి కుటుంబానికి స్మార్ట్ కార్డు ప్రయోజనాలు :**

ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ కార్డు ప్రయోజనాలను ప్రతి కుటుంబం పొందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. మండల వ్యాప్తంగా 11265 రేషన్ కార్డులు ఉన్నాయని, వీటికి అదనంగా 1242 కొత్త రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందజేస్తామని అన్నారు.అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని, సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహకారం అందించాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. మండలంలోని అధికారుల పనితీరు సంతృప్తికరంగా ఉందని మరికొంత మెరుగుపరుచుకుంటే సత్ఫలితాలు అభివృద్ధి రూపంలో సాధించుకునే అవకాశం ఉంటుందని సూచించారు.

**- ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కష్టాలు తొలగించాలి :**

పినపాక మండలంలో మొత్తం 663 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని కానీ కేవలం 171 మాత్రమే ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవడం జరిగిందని, అసంపూర్తిగా వివిధ దశలో ఉన్న మిగతా ఇండ్లను పూర్తి చేయించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జరుగుతున్న ఆలస్యానికి ఇసుక కొరత కారణమని మా దృష్టికి వచ్చిందని,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులను ఇసుక విషయంలో ఇబ్బందులకు గురిచేయవద్దని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. పేద కుటుంబాలు సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, నిర్మాణ పనులు సజావుగా సాగేందుకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ఇసుక సరఫరా విషయంలో లబ్ధిదారులకు అనవసరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఫారెస్ట్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని పేర్కొన్నారు.

**- ఎల్నినో ప్రభావాలను ప్రణాళికతో ఎదుర్కొందాం :**

వాతావరణ మార్పులు, ఎల్నినో ప్రభావాల నేపథ్యంలో వ్యవసాయ రంగం ఎదుర్కొనే సవాళ్లపై రైతులు, అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడనున్న నేపథ్యంలో నీటి లభ్యతను అంచనా వేయాలని, సాగు ప్రణాళికను జాగ్రత్తగా రూపొందించుకోవాలని ఈ క్రమంలో వాణిజ్య పంటల వైపు రైతు దృష్టి సారించడం మూలాన ఆర్థిక అభివృద్ధి సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. అందుబాటులో ఉన్న వాతావరణ, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను అనుసరించి రైతులు నిర్ణయాలు తీసుకోవాలని, మండలంలోని రైతులు వరి సాగు చేయవద్దని మునగ,మినుములు, పెసలు, కందులు, నువ్వులు తదితర వాణిజ్య పంటలను సాగు చేస్తే ప్రభుత్వం అందించే సబ్సిడీలకు అర్హులవుతారని కోరారు.

**- దసరా తర్వాత ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితా :**

ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ఆశలు పెట్టుకున్న అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. దసరా పండుగ అనంతరం ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. నిర్మాణం మొదలు పెట్టని, అసంపూర్తి నిర్మాణాలతో ఆగిన ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తిచేసే విధంగా అధికారులు చొరవ చూపాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలులో నిజమైన లబ్ధిదారులను గుర్తించడమే కాకుండా ఎంపికలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఏవో వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై డిటి ప్రభాకర్ రావు, వెటర్నరీ వైద్యురాలు శిరీష, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రామనాథం, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు శ్రీనివాసరెడ్డి,బోడ రమేష్, ఆత్మ కమిటీ జిల్లా అధ్యక్షులు మద్దెల సమ్మయ్య, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు పూనెం వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ల సంఘం జిల్లా అధ్యక్షులు అచ్చా నవీన్,ఉప సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షులు రాజేష్, గ్రామపంచాయతీ సర్పంచులు,ఉప సర్పంచులు స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రాయపట్నంలో ఎల్‌నినో, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన సర్పంచ్ కంచం గోపి

**•తక్కువ కాలపరిమితి కలిగిన పంటల సాగుతో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలి: వ్యవసాయ విస్తరణ అధికారి గురుమూర్తి**





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
మండల పరిధిలోని రాయపట్నం రైతు వేదికలో గ్రామ సర్పంచ్ కంచం గోపి అధ్యక్షతన ఎల్‌నినో ప్రభావం, యాసంగి సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి గురుమూర్తి మాట్లాడుతూ, రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రతి సీజన్‌లో ఒకే పంటపై ఆధారపడకుండా, తక్కువ కాలపరిమితి కలిగిన పెసర, మినుము, నువ్వులు, కుసుమ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. తద్వారా నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు, నీటి వనరులపై ఒత్తిడిని తగ్గించవచ్చని పేర్కొన్నారు.గ్రామ సర్పంచ్ కంచం గోపి మాట్లాడుతూ, యాసంగి సీజన్‌లో రైతులందరూ తక్కువ కాలపరిమితి కలిగిన అపరాల పంటలైన పెసర, మినుముతో పాటు నువ్వులు, కుసుమ వంటి నూనెగింజల పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. నీటి వినియోగాన్ని తగ్గిస్తూ, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులు ముందస్తు ప్రణాళికతో సాగుకు సిద్ధం కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్ అల్లాడి గోపాలరావు, మండల వ్యవసాయ అధికారి, మార్నీడు పుల్లారావు, తేళ్ల కృష్ణ, తేళ్ల సతీశ్,నాగనబోయిన గోపి యడ్ల సాంబయ్య, రాయుడు భద్రయ్య, జింకల కొండలరావు, కంచం రాములు, నంద్రు తిమోతి, మార్నీడు వెంకయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## పాడిపంటలతో రైతుల ఇళ్లలో ఆనందం వెల్లివిరియాలి : అచ్చునూరి కిషన్ ముదిరాజ్.



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ములుగు జిల్లా, ఇంచర్ల గ్రామంలో అచ్చునూరి కిషన్ దంపతులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, భక్తిపారవశ్యం మధ్య అమ్మవారిని దర్శించుకొని గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా అచ్చునూరి కిషన్ మాట్లాడుతూ, అమ్మవారి కరుణాకటాక్షాలతో ఎల్‌నినో ప్రభావం, కరువు కాటకాలు తొలగిపోయి సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. పాడిపంటలు సమృద్ధిగా పండి రైతుల జీవితాల్లో సిరిసంపదలు వెల్లివిరియాలని, రైతుల ఇళ్లలో ఆనందం నిండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి ఇంటా శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని జగజ్జననిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజల కష్టాలు తొలగి, రైతాంగం సుభిక్షంగా ఉండి, గ్రామమంతా ఆధ్యాత్మిక చైతన్యంతో పాటు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ పూజా కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముస్నిపెల్లి కుమార్ గౌడ్, సోనవేణి కుమార్, శానవేని సురేష్, చింతల రవీందర్, సోమల్ల అనిల్, బేతెల్లి అవినాష్ రెడ్డి, పూజారి శ్రీనివాస్, మాదాసు శ్రీనివాస్, పెద్ది అశోక్, దేవునూరి నాగరాజు, అచ్చునూరి వంశీ, దేవునూరి జయప్రకాష్, సాయి దేవహర్ష, దేశిని రమేష్, బల్ల మహేష్, భాస్కర్, సదానందం, కుమార్, జలేందర్, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలోని అటవీ ప్రాంతాల్లో నాటుసారా బట్టీలు...?






**ఎక్సైజ్ అధికారులు స్పందించి నాటుసారా తయారీకి అడ్డుకట్ట వేయాలి**

**అంటున్న మండల ప్రజలు.**

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**

పినపాక మండల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో నాటుసారా తయారీ జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో నాటుసారా బట్టీలు నిర్వహిస్తున్నారనే సమాచారంపై ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

నాటుసారా తయారీ, విక్రయాల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు అటవీ ప్రాంతాల్లో సమగ్ర తనిఖీలు నిర్వహించి, నాటుసారా తయారీ కేంద్రాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి, నాటుసారా తయారీని పూర్తిగా అరికట్టి, మండలంలో నాటుసారా రహిత వాతావరణం కల్పించాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

- అధికారులు స్పందించాలి.. ప్రజలకు భరోసా కల్పించాలి..!

మండలంలో నాటుసారా తయారీ, విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎక్సైజ్ శాఖ సమర్థవంతమైన కార్యాచరణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల నుంచి సమాచారం సేకరించి, ఆరోపణలపై విచారణ జరపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నాటుసారా సమస్యను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే పాయం.



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూరేలా కృషి చేస్తామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమన్నారు. సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఇల్లు లేని అర్హులైన జర్నలిస్టులను గుర్తించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అవకాశం కల్పించే అంశంపై కృషి చేస్తామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, అర్హులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.జర్నలిస్టులు తమ వృత్తిపరమైన బాధ్యతలను నిర్వర్తించడంతో పాటు కుటుంబ పోషణ, పిల్లల చదువులు, నివాసం వంటి అనేక అంశాల్లో ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని,ఈ నేపథ్యంలో అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అవకాశం కల్పిస్తే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు కుటుంబాలకు భద్రత కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ బృహస్పతి, నిమ్మలింగారెడ్డి, ఊటుకూరు వెంకటేశ్వరరావు( రమణ) కొంపెల్లి సంతోష్,సత్రపల్లి సారయ్య, కట్టా శ్రీను, నిట్ట వెంకటేశ్వర్లు, దొడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కుంకుమ పూజలు





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
కరీంనగర్ జిల్లా బొమ్మనపల్లి మండలం లోని రాముల పల్లె,

బొమ్మనపల్లి గ్రామంలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ముల నక్షత్రం తో కూడి యున్న శుక్రవారం రోజున సరస్వతీ పూజలు మరియు కుంకుమ పూజలు వైభవంగాలు ఘనంగాను జరిగాయి. చిన్నారులు తమ పుస్తకాలను పెన్నులను అమ్మవారి ముందు ఉంచి పూజలు జరిపించారు. సరస్వతి కటాక్షంతో విద్యాబుద్ధులు చక్కగా అబ్బాలని కోరుకున్నారు. అలాగే సుహాసినిలు తమ సౌభాగ్యం కై కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అర్చకులు

డాక్టర్ రామక మోహన్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో ఆధ్యాత్మిక చింతన వెల్లి విరిసింది.

## విజయ్ దేవరకొండ “రౌడీ జనార్ధన” మూవీ నుంచి హీరోయిన్ కీర్తి సురేష్ బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్

స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ లో నటిస్తున్న క్రేజీ మూవీ “రౌడీ జనార్ధన”. స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ రవికిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కీర్తి సురేష్ నాయికగా నటిస్తోంది. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా “రౌడీ జనార్ధన” సినిమా రూపొందుతోంది.

ఈ రోజు హీరోయిన్ కీర్తి సురేష్ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు బర్త్ డే విశెస్ చెబుతూ “రౌడీ జనార్ధన” సినిమా నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో కీర్తి సురేష్ ట్రెడిషనల్ లుక్ లో బ్యూటిఫుల్ గా కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. “రౌడీ జనార్ధన” సినిమాను సిల్వర్ స్క్రీన్ పై చూసేందుకు రౌడీ ఫ్యాన్స్ తో పాటు మూవీ లవర్స్ వెయిట్ చేస్తున్నారు. ఈ డిసెంబర్ లో ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.నటీనటులు – విజయ్ దేవరకొండ, కీర్తి సురేష్, తదితరులుటెక్నికల్ టీమ్ ప్రొడక్షన్ డిజైనర్ – డినో శంకర్డీవోపీ – ఆనంద్ సి చంద్రన్
బ్యానర్ – శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ప్రొడ్యూసర్స్ – దిల్ రాజు, శిరీష్పీఆర్ఓ – సురేష్ (ఎస్ కే మీడియా) స్టోరీ డైరెక్షన్ – రవికిరణ్ కోలా






## ఇండియన్ సినిమాలో యాక్షన్ హీరో అంటే ఇకపై విజయ్ దేవరకొండ గురించే చెప్పుకుంటారు - సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా

ఇండియన్ సినిమాలో యాక్షన్ హీరో అంటే ఇకపై విజయ్ దేవరకొండ గురించే చెప్పుకుంటారని అన్నారు సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా. విజయ్, రశ్మిక జంటగా నటించిన రణబాలి సినిమాను ఆయన వీక్షించారు. ఈ సినిమా చూసిన అనంతరం తన అనుభూతిని సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు సందీప్ రెడ్డి వంగా. రణబాలి సినిమాలో విజయ్ చేసిన యాక్షన్, ఫెరోషియస్ పర్ ఫార్మెన్స్ యూనిక్ గా ఉందని ఆయన తన పోస్ట్ లో పేర్కొన్నారు. సందీప్ రెడ్డి వంగా స్పందిస్తూ – విజయ్...నీ యాక్షన్, ఫెరోషియస్ పర్ ఫార్మెన్స్ అద్భుతంగా ఉంది. స్క్రీన్ మీద నీ ఫైట్స్ చూస్తుంటే ఆ ఇంటెన్సిటీ ఫీల్ అయ్యాం. ఇకపై ఇండియన్ సినిమాలో యాక్షన్ హీరో అంటే నీ గురించే చెప్పుకుంటారు. కంగ్రాట్స్ విజయ్. ప్రేక్షకులు రణబాలి సినిమాను విజయ్ ఔట్ స్టాండింగ్ పర్ ఫార్మెన్స్ కోసం చూడాలి. రశ్మిక జయమ్మ పాత్రలో ఆకట్టుకుంది. ఆమె పాత్ర ఎంతో రియలిస్టిక్ ఫీల్ ను కలిగించింది. అజయ్ – అతుల్ మ్యూజిక్ మరో హైలైట్ గా నిలిచింది. చరిత్ర నుంచి ఇలాంటి ఒక నేపథ్యాన్ని ఎంచుకుని సినిమాగా రూపొందించిన డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ ప్రయత్నాన్ని అభినందిస్తున్నా. మన పాఠ్యపుస్తకాల్లో చెప్పని చారిత్రక అధ్యాయాన్ని రణబాలి చూపించింది. అన్నారు.

## ‘రామాయణ’.. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా: రాజమౌళి





దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్మాత్మక చిత్రం ‘రామాయణ’ . తాజాగా ఈ మూవీపై అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా కోసం తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు.“రామాయణం అనేది ప్రతి భారతీయ కథకుడూ చెప్పాలని కలలుకనే అద్భుతమైన కథ. దీన్ని ఇంత భారీ స్థాయిలో తెరపైకి తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉంది. నటీనటులంతా ఈ పాత్రలకు తమ నటనతో ప్రాణం పోశారు. ఈ సినిమా విడుదల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. చిత్రబృందానికి నా శు భాకాంక్షలు” అని రాజమౌళి రాసుకొచ్చారు.ఇక, ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయి పల్లవి నటిస్తున్న నటిస్తున్న సంగతి తెలిసిందే. తొలి భాగం ‘రామాయణ: రైజ్ ఆఫ్ ఏ లెజెండ్’ ఈ నవంబర్ 5న విడుదల కానుంది . రెండో భాగం 2027 దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.ఓ

## ‘రణబాలి’ చూసినవారికి ప్రేమతో హగ్స్: రష్మిక



విజయ్ దేవరకొండ , రష్మిక దంపతులు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘రణబాలి). రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. శింగనమల బొబ్బిలి రణబాలిగా విజయ్ దేవరకొండ నటించగా, ఆయన భార్యగా జయమ్మ పాత్రలో రష్మిక మెరిశారు. ఈ చిత్రంతోపాటు తన పాత్రకు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందనపై రష్మిక భావోద్వేగానికి గురయ్యారు. తన ఆనందాన్ని పంచుకుంటూ సామాజిక మాధ్యమాల్లో ఓ లేఖను పోస్టు పెట్టారు.“జయమ్మ..! ఆమె ప్రేమ ఎంతో స్వచ్ఛమైనది. ఓ మహిళగా ఉండటమంటే ఏంటో ఆమె నాకు నేర్పింది. తన ప్రజల కోసం నిలవడం, తనవారిని కాపాడుకోవడం, ప్రేమను పంచడం.. ఇదే నిజమైన స్త్రీత్వానికి అర్థమని తెలియపరిచింది. రణబాలి, జయమ్మలపై కురిపిస్తున్న ప్రేమను చూసి ఎంతో ఆనందం, ఉద్వేగం కలుగుతోంది. ‘రణబాలి’ మన సామాజిక శక్తిని, దేవుడిపై విశ్వాసాన్ని, సమష్టిగా పోరాడే స్ఫూర్తిని చాటిచెబుతుంది. థియేటర్లలో ఆస్వాదించాల్సిన ఓ అద్భుతమైన అనుభూతి ఈ సినిమా. దర్శకుడు రాహుల్ కృషికి వస్తున్న ప్రశంసలు చూస్తుంటే సంతోషంగా ఉంది. విజయ్.. నేను ఎప్పుడూ చెబుతూనే ఉంటాను. ఇప్పుడూ చెబుతున్నాను. నీ కష్టించే గుణానికి నేను అభిమానిని. నువ్వు ఎప్పుడూ కష్టపడి పనిచేస్తుంటావు. ఇప్పుడు నీ కష్టాన్ని అందరూ మెచ్చుకుంటుంటే, నాలో ఆనందం ఉప్పొంగుతోంది. మనసంతా ప్రశాంతతతో నిండిపోయింది. ఇప్పటికే ఈ సినిమాను చూసినవారికి గట్టిగా హగ్స్ ఇచ్చి నా ప్రేమను తెలియజేస్తున్నాను. ప్రేమతో, మీ జయమ్మ” అని రష్మిక తన పోస్టులో పేర్కొన్నారు.



## రొమాంటిక్ థ్రిల్లర్ షురూ?

‘పెద్ది’ చిత్రంతో ఈ మధ్యే తెరపై మెరిసి కుర్రకారుని ఆకట్టుకున్నారు బాలీవుడ్ కథానాయిక జాన్వీ కపూర్. ప్రస్తుతం అగ్రతారల సరసన అవకాశాల్ని అందుకుంటూ జోరుమీదున్న ఈ తార.. దర్శకుడు ఉమేశ్ బిష్ట్ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. జాన్వీ, శ్రీలీల, సిద్ధార్థ్ గుప్తా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పుడీ సినిమా గురించి మరో ఆసక్తికర విషయం నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. తాజాగా ఈ చిత్ర షూటింగ్‌ను మొదలెట్టినట్లు సమాచారం. “చిత్రబృందం మొదటి షెడ్యూల్ చిత్రీకరణను ప్రారంభించింది. ఇందులో జాన్వీ, శ్రీలీల, సిద్ధార్థ్ భాగమయ్యారు. రొమాంటిక్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ ప్రాజెక్ట్ కోసం శ్రీలీల, జాన్వీ కలిసి నటించడం చిత్రానికే ప్రధాన ఆకర్షణగా నిలవనుంద”ని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఒకే వ్యక్తిని ఇష్టపడే ఇద్దరు మహిళల చుట్టూ తిరిగే లవ్‌స్టోరీగా ఈ సినిమా కథ ఉంటుందని, త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన వివరాల్ని అధికారికంగా వెల్లడించడానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం.

## యూట్యూబ్ సెన్సేషన్ అజయ్ (ఏయ్ జూడ్) హీరోగా కొత్త సినిమా ప్రారంభం



యూట్యూబ్ సెన్సేషన్, ‘ఏయ్ జూడ్’గా పాపులర్ అయిన అజయ్ హీరోగా తెరకెక్కనున్న కొత్త సినిమా నేడు అధికారికంగా ప్రారంభమైంది. రాము కొప్పుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నెక్సస్ సినిమాస్, స్కైబ్లేజ్ సిల్వర్ స్క్రీన్ బ్యానర్లపై నెక్సస్ శ్రీధర్, దీపక్ ముస్త్యాల సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



ఈ చిత్రానికి చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తుండగా, ఫహాద్ అబ్దుల్ మజీద్ సినిమాటోగ్రాఫర్‌గా, క్రాంతి ప్రియమ్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.
రామానాయుడు స్టూడియోస్‌లో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలతో ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ఈ వేడుకకు చిత్ర బృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు, ప్రత్యేక అతిథులు హాజరయ్యారు. ప్రముఖ దర్శకుడు బి. గోపాల్ గారు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, దర్శకుడు హరీష్ శంకర్ గారు తొలి క్లాప్ ఇచ్చారు. దర్శకుడు బుచ్చిబాబు సానా గారు తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు.
ఈ ప్రారంభోత్సవ వేడుకకు బెజవాడ ప్రసన్న గారు, థామస్ రెడ్డి ఆదూరి, డా. పృథ్వీరాజ్ గారు (క్రాంతిదళ్), శ్రీనివాస్ దాసరి గారు (కలోజీ టీవీ), రఘు గంజి గారు (తొలి వెలుగు), బాబు దేగల గారు, సత్యం రాజేష్ గారు తదితర ప్రముఖులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

# సాలగ్రామ స్వామి అలంకరణల్లో ఆధ్యాత్మిక వైభవం..

**•అర్చకులు వెంకటరమణాచార్యులకు జన్మదిన శుభాకాంక్షలు**

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
స్వామివారి సేవలో అంకితభావం.. భక్తులకు దివ్యదర్శన అనుభూతి
ఆనంద్ బాగ్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు ముదుంబై శ్రీ వెంకటరమణాచార్యుల పుట్టినరోజు సందర్భంగా శనివారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విలేకరులు కుమ్మరి రాజు, తుపాకుల రమేష్, పాండు గౌడ్‌లు ఆలయానికి వెళ్లి వెంకటరమణాచార్యులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



**విశిష్ట అలంకరణలతో భక్తులను ఆకట్టుకుంటూ..**

శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులుగా సేవలందిస్తున్న వెంకటరమణాచార్యులు ప్రతిరోజూ స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణలు చేస్తూ భక్తులను ఆకట్టుకుంటున్నారు. ఆలయంలోని సాలగ్రామాన్ని శ్రీమహావిష్ణువు వివిధ అవతారాల రూపాల్లో అలంకరిస్తూ, ప్రతి అవతారం వెనుక ఉన్న ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను భక్తులకు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా శ్రీమహావిష్ణువు దశావతారాలను ప్రతిబింబించేలా రూపొందించే అలంకరణలు భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. భగవంతుని వివిధ రూపాలను కళ్లకు కట్టినట్లు ఆవిష్కరిస్తూ, భక్తుల్లో భక్తిభావాన్ని పెంపొందించేందుకు ఆయన విశేషంగా కృషి చేస్తున్నారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు సైతం స్వామివారి అలంకార దర్శనం ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తోంది.

**అర్చకుల సేవలకు విలేకరుల ప్రశంసలు**

స్వామివారికి నిత్య పూజలు నిర్వహిస్తూ, సంప్రదాయాలను కాపాడుతూ, వినూత్న అలంకరణలతో భక్తులకు దైవదర్శన భాగ్యాన్ని కల్పిస్తున్న వెంకటరమణాచార్యుల సేవలను విలేకరులు అభినందించారు. భక్తి, నిబద్ధత, ఆధ్యాత్మిక చింతనతో ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.
జన్మదిన సందర్భంగా ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి సేవలో మరింత కాలం కొనసాగుతూ భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందించాలని ఆకాంక్షించారు. అనంతరం మరోసారి శుభాకాంక్షలు తెలియజేస్తూ తమ అభిమానం వ్యక్తం చేశారు.

# దసరా నవరాత్రుల్లో లక్ష్మీదేవిగా అమ్మవారి దివ్యదర్శనం...

**•కివ్వకలో ఘనంగా కుంకుమార్చనలు...**
**•మహిళలు, భవానీ భక్తుల సామూహిక పూజలు.. భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తజనం**

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కివ్వక గ్రామంలోని స్థానిక ఆలయంలో అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సిరిసంపదలను ప్రసాదించే తల్లిగా కొలువుదీరిన అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, ప్రత్యేక అభిషేకాలు, ఆకర్షణీయమైన అలంకరణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



**వైభవంగా సామూహిక కుంకుమ పూజలు**

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లక్ష్మీదేవి కుంకుమ పూజల్లో మహిళలు, భవానీ భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించి అమ్మవారిని కొలిచారు. కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, గ్రామ ప్రజలకు ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

**భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం**

కివ్వక గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆసక్తిగా పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో కిటకిటలాడింది. భవానీ భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

**భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ**

పూజా కార్యక్రమాలకు హాజరైన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పూజలు ముగిసిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు పులిహోర పంపిణీ చేశారు. భక్తుల భాగస్వామ్యంతో కుంకుమ పూజలు వైభవంగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో అర్చకులు వాడపల్లి సాయి, గురుస్వామి బట్టి వీరబాబు, భవానీలు రాయికృష్ణార్జునరావు, ఇనుముల గోపరాజు, పగిళ్ల రాంబాబు, ఎం. వెంకన్నబాబు, రమేష్ గుప్తా, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో మహిళలు, భవానీ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు.

# గోకవరం దేవి చౌక్ అమ్మవారి వెండి గోపురానికి 100 గ్రాముల వెండి విరాళం

**•విజయ దుర్గ బ్రాయిలర్స్ అధినేత గుడిమెట్ల శివ రమేష్ రెడ్డి, ఆయన సతీమణి సిరి దంపతుల దాతృత్వం**

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
గోకవరం దేవి చౌక్ లో కొలువుతీరిన అమ్మవారి ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భక్తులు అందిస్తున్న సహకారం అభినందన అభినందనమైన పలువురు పేర్కొంటున్నారు. అమ్మవారి వెండి గోపురం నిర్మాణం నిమిత్తం విజయ దుర్గ బ్రాయిలర్స్ అధినేత గుడిమెట్ల శివ రమేష్ రెడ్డి, ఆయన సతీమణి సిరి దంపతులు 100 గ్రాముల వెండిని విరాళంగా అందజేశారు.
అమ్మవారిపై తమకున్న భక్తి, విశ్వాసంతో ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే సదుద్దేశంతో శివ రమేష్ రెడ్డి దంపతులు ఈ విరాళాన్ని అందించడం విశేషం. దేవాలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణకు భక్తులు తమవంతు సహకారం అందించడం సమాజంలో భక్తిభావాన్ని, ఐక్యతను మరింత పెంపొందిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



గోకవరం దేవి చౌక్ అమ్మవారి వెండి గోపురం నిర్మాణానికి అవసరమైన సహకారాన్ని అందించడం ద్వారా శివ రమేష్ రెడ్డి దంపతులు తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా భక్తులు, దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన విధంగా విరాళాలు అందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు.
ఈ సందర్భంగా దాత గుడిమెట్ల శివ రమేష్ రెడ్డి, ఆయన సతీమణి సిరి దంపతులకు పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. అమ్మవారి ఆశీస్సులు దాతల కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.
ఈ కార్యక్రమంలో విజయ దుర్గ బ్రాయిలర్స్ అధినేత గుడిమెట్ల శివ రమేష్ రెడ్డి దంపతుల వెంట గోకవరంలోని ప్రసన్నలక్ష్మి చికెన్ సెంటర్ అధినేత కర్రి సూరా రెడ్డి గారు కూడా పాల్గొన్నారు.

# గోకవరం దేవిచౌక్ అమ్మవారిని, గద్దె లోని అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**•అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరి పై నిండుగా ఉండాలి: ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17: .**
గోకవరం గ్రామంలోని దేవిచౌక్ కనకదుర్గ అమ్మవారిని, గద్దె లోని కనకదుర్గ అమ్మవారిని జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ భార్య సమేతంగా మణిమ్మతో కలసి దర్శించుకున్నారు. ఆలయంలోని కొలువుదీరిన అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ, కనకదుర్గ అమ్మవారి





కృపాకటాక్షాలు ప్రజలందరిపై నిండుగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, గ్రామంలో శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.
ఎమ్మెల్యే రాకతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ బి.యల్.ఎ.-1, విశ్వహిందూ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు, సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ ఉంగరాల రాము,గోకవరం సొసైటీ చైర్మన్ గాజంగం సత్తిబాబు, దాసరి సతీష్ బాబు,మండల కన్వీనర్ పిల్ల చంటిబాబు, మాజీ జెడ్పిటిసి పాలూరి బోసి బాబు, తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బత్తుల సత్తిబాబు, బద్దిరెడ్డి అచ్చన్న దొర,దాసరి సీతారామ్ కృష్ణ,ఇనకోటి పెద్దలు,బద్దిరెడ్డి బాబి,గునిపే భరత్,వరసాల ప్రసాద్,పోసిన ప్రసాద్,ఆచంట రాజు,మండిగ గంగాధర్,ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి

**•జనసేన లోకి చేరిన 50 మంది ఎల్ఎన్ వి పురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సిపి నాయకులు**
**•పేచ్చేటి కృష్ణ తోపాటు 50 మంది పార్టీ కండువాను కప్పిన ఎమ్మెల్యే అంజిబాబు, జిల్లా అధ్యక్షులు చినబాబు**

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
జనసేన పార్టీ ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం ఎల్ఎన్ వి పురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సిపి చెందిన పేచ్చేటి కృష్ణ తోపాటు 50 మంది కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం జనసేన పార్టీలోకి చేరారు. ఎమ్మెల్యే అంజిబాబు, పార్టీ జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు వారికి జనసేన పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో నిస్వార్థంగా పనిచేస్తూ ప్రజలకు సేవ



చేయాలని సూచించారు. పార్టీ బలోపేతం చేయడంలో అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. కండిపోయిన రాంబాబు, బలం నాగేశ్వరరావు, బొక్క రాంబాబు, పేచ్చిటి రాంబాబు, మల్లాటి గోవిందు, అనంత బాల, కోళ్ల సాయి, వెంద్ర పవన్, పేచ్చేటి నాగరాజు, వీరవల్లి లక్ష్మణ్ తదితరులు పార్టీలోకి చేరారు.

# నూతన ఎస్ఐగా బాధ్యతలను స్వీకరించిన ఎన్.ధర్మ..

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
మండల పరిధిలోని వాడపల్లి పోలీస్ స్టేషన్ కు నూతన ఎస్ఐగా వచ్చినటువంటి ఎన్.ధర్మ శనివారం నాడు బాధ్యతలను స్వీకరించారు,ఇట్టి సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు,అసాంఘిక కార్యక్రమాలు,జూదం,అక్రమ మద్యం,పిడిఎస్ బియ్యం,ఇసుక అక్రమ రవాణా తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు,పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు.



# సాయిసన్నిధిలో శరన్నవరాత్రి ఆధ్యాత్మిక వైభవం

**మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు.. 108 కలశాలతో సాయినాథునికి శుష్కఫలాల అభిషేకం**





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ సాయిసన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ మహాలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మీదేవి హోమం, కుంకుమార్చనతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.శ్రీ సాయినాధుని108వ పుణ్యతిథి (సమాధి) ఉత్సవాలను పురస్కరించుకుని 108 కలశాలతో స్వామివారికి వివిధ శుష్కఫలాలతో (ఎండు పండ్లతో) ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. వేదమంత్రాలు, భక్తి గీతాల నడుమ జరిగిన ఈ పూజా కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక పారవశ్యంలో ముంచెత్తాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం శ్రీమతి బంగారు లక్ష్మీ భగవతారిణి ఆధ్వర్యంలో పార్వతీ కల్యాణం హరికథా గానం నిర్వహించారు. హరికథలో ఆధ్యాత్మిక అంశాలను వివరిస్తూ భక్తులకు భక్తిభావాన్ని పంచారు. శ్రీ సాయిసన్నిధిలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకం, హరికథా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# వైసీపీ మాజీ ఎమ్మెల్యే 'పిన్నెల్లి రామకృష్ణారెడ్డి' గృహనిర్బంధం..!



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
ఎన్నికల దృష్ట్యా పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మాచర్ల పోలీసుల నోటీసులు ఇచ్చారు. నామినేషన్ల దృష్ట్యా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు.

# దుర్గి లో అక్రమ బెల్ట్ షాప్ పై పోలీసులు దాడి

**ఒకరి అరెస్టు మద్యం స్వాధీనం**



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
దుర్గి మండల కేంద్రంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేసి గొంది వెంకయ్య అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బి. గోపాల్ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 8 క్వార్టర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మద్యం అక్రమ విక్రయాలు, బెల్ట్ షాపుల నిర్వహణపై నిఘా ముమ్మరం చేశామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# మండవల్లిలో ఎన్డీఏ కూటమి మండల స్థాయి సమావేశాలు



**స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి : ఎమ్మెల్యే కామినేని**



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:**
ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గ మండవల్లి మండలం అక్టోబర్17:ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్ కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ మండవల్లి మండలం మండవల్లి శుభం ఫంక్షన్ హాల్ నందు స్థానిక సంస్థల ఎన్నకలకు మండల స్థాయి కూటమి నేతలతో ఏర్పాటుచేసిన ఎన్డీఏ కూటమి మండల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామినేని ఎన్నికలపై మరియు అభ్యర్థులపై దిశ నిర్దేశం చేసారు. అలాగే మండలంలో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం కూటమి పాలనకు ఆకర్షితులై కానుకొల్లు గ్రామ వైసీపీ నాయకులు శౌంఠి కుమారస్వామి మరియు వారి అనుచరులు కూటమిలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కామినేని కూటమి జెండా కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు , రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు , నియోజకవర్గ టిడిపి కన్వినర్ కొత్తా నాగేంద్ర కుమార్, నియోజకవర్గం జనసేన పార్టీ ఎన్నికల సమన్వయకర్త కొల్లీ

# ప్రజా చైతన్యానికి యువ దర్శకులు కదలాలి

**భారతీయ సినిమాకు హైదరాబాద్‌ను ప్రధాన కూడలిగా తీర్చిదిద్దుతాం: భట్టి విక్రమార్క**
**బతుకమ్మ సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీక**
**వాతావరణ మార్పులు, నీటి సంక్షోభంపై షార్ట్‌ఫిల్మ్‌లతో అవగాహన కల్పించాలి**
**యువ సినీ ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం**
**హైదరాబాద్ శిల్ప కళావేదికలో బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్ అవార్డ్స్--2026లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**









**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 17:** యువ ఫిలిం మేకర్లు తమ సృజనాత్మకతతో సమాజాన్ని ఆలోచింపజేసే లఘు చిత్రాలను రూపొందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి సంక్షోభం వంటి సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. బతుకమ్మ పండుగలో రంగురంగుల పూలు ఎలా విరబూస్తాయో, యువ ఫిలిం మేకర్ల జీవితాలు కూడా విజయాలతో అలా వికసించాలని ఆకాంక్షించారు. యువ దర్శకులు మంచి కథలతో ముందుకు వచ్చి, వినోదంతో పాటు సమాజానికి మేలు చేసే చిత్రాలను రూపొందించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను కేవలం తెలుగు చిత్ర పరిశ్రమకే పరిమితం చేయకుండా, భారతీయ సినిమాకు ప్రధాన కూడలిగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ యువతలోని సినీ ప్రతిభను ప్రోత్సహిస్తూ, జాతీయ స్థాయిలో హైదరాబాద్‌ను ప్రముఖ సినీ గమ్యస్థానంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జరిగిన బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్ అవార్డ్స్--2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భట్టి విక్రమార్క జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మకు ప్రతిరూపమని అన్నారు. వివిధ రంగులు, సువాసనలతో కూడిన పూలు ఒకచోట చేరినట్లుగా సమాజంలోని భిన్న వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చే వేడుక బతుకమ్మ అని పేర్కొన్నారు. అందుకే ఈ పండుగ సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు.

**హైదరాబాద్‌ను భారతీయ సినిమాకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతాం**

తెలుగు చిత్ర పరిశ్రమ హైదరాబాద్‌లోనే ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రతిభావంతులకు తగిన అవకాశాలు లేవనే అభిప్రాయం గతంలో ఉండేదని భట్టి విక్రమార్క అన్నారు. అయితే, ప్రస్తుతం తెలంగాణకు చెందిన పలువురు దర్శకులు, హీరోలు, నిర్మాతలు చిత్ర పరిశ్రమలో తమ ప్రతిభను చాటుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో సృజనాత్మకతకు కొదవలేదని, యువ ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే మరింత మంది ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారని చెప్పారు. హైదరాబాద్‌ను భారతీయ సినిమా పరిశ్రమకు ప్రధాన గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహా రాష్ట్ర మంత్రివర్గం ఈ దిశగా ఆలోచనలు చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న సినీ రంగ ప్రముఖులను హైదరాబాద్‌కు ఆహ్వానించడం, ఇక్కడ సినిమా రంగ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, అనుకూల వాతావరణాన్ని కల్పించడం ద్వారా నగరాన్ని భారతీయ సినిమా రంగంలో కీలక కేంద్రంగా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు.

**మూడు నిమిషాల్లో కథ చెప్పడమూ గొప్ప సృజనాత్మకతే**

యువ దర్శకుల్లోని ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్ నిర్వహించడం అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి అన్నారు. మూడు గంటల సినిమాలో చెప్పగలిగే కథను కేవలం రెండు, మూడు నిమిషాల నిడివి ఉన్న షార్ట్‌ఫిల్మ్‌లో చెప్పడం ఎంతో సృజనాత్మకతతో కూడుకున్న విషయమని పేర్కొన్నారు. తక్కువ సమయంలో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ, తమ ఆలోచనను సమర్థంగా వ్యక్తీకరించగలిగిన యువ దర్శకులకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పోటీలో అవార్డులు అందుకోని వారి చిత్రాల్లోనూ మంచి ప్రతిభ కనిపించిందని పేర్కొంటూ, అవార్డు రాకపోయినంత మాత్రాన నిరుత్సాహపడవద్దని యువ ఫిలిం మేకర్లకు సూచించారు. భవిష్యత్తులో ఎవరు గొప్ప దర్శకులుగా ఎదుగుతారో ఇప్పుడే చెప్పలేమని, అందరూ తమ సృజనాత్మకతను కొనసాగిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. యువ దర్శకులను ప్రోత్సహించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో షార్ట్‌ఫిల్మ్‌లు, పాటలు, జానపద గీతాలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, వ్యాసాలు తదితర విభాగాల్లో మొత్తం 29 అవార్డులతో యువ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. యువత రూపొందించిన షార్ట్‌ఫిల్మ్‌లను వీక్షించి, ప్రతిభావంతులను మరింతగా ప్రోత్సహించే అవకాశాలను పరిశీలిస్తానని తెలిపారు.

**వాతావరణ మార్పులపై ప్రజల్లో అవగాహన కల్పించాలి**

సినిమా వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే సందేశాలను అందించే సాధనంగా మారాలని భట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యంగా రాబోయే రోజుల్లో వాతావరణ మార్పులు, సూపర్ ఎల్‌నినో ప్రభావాలు, ఉష్ణోగ్రతల పెరుగుదల, వర్షపాతంలో మార్పులు ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులపై ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయడంలో యువ దర్శకులు తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యే కథలతో, ఆకట్టుకునే దృశ్యాలతో షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందించి ప్రకృతి పరిరక్షణ, నీటి పొదుపు, పర్యావరణ సమతుల్యతపై చైతన్యం కల్పించవచ్చన్నారు. ఒక చిన్న గ్రామంలో జరిగే సంఘటన ఆధారంగా రూపొందించిన లఘు చిత్రం కూడా నేటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపగలదని చెప్పారు. యువ దర్శకుల చేతుల్లో సమాజాన్ని ఆలోచింపజేసే శక్తి ఉందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

భవిష్యత్తులో నీటి లభ్యత కీలక సమస్యగా మారే ప్రమాదం ఉందని ఉప ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఆహార ధాన్యాల లభ్యతతో పోలిస్తే తాగునీటి నిల్వలు, వాటి సంరక్షణపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వర్షపాతం పరిస్థితులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, నీటి ఆవిరి పెరుగుదల వంటి అంశాలు భవిష్యత్తులో నీటి వనరులపై ఒత్తిడిని పెంచవచ్చని పేర్కొన్నారు. మనుషులు, పశువులు, పక్షుల తాగునీటి అవసరాలను తీర్చేందుకు అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా ఎలా కాపాడుకోవాలి, వర్షపు నీటిని ఎలా ఒడిసిపట్టాలి, ప్రకృతిని ఎలా పరిరక్షించాలి వంటి అంశాలను కథాంశాలుగా తీసుకొని షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందించాలని యువ దర్శకులకు విజ్ఞప్తి చేశారు. ప్రజల్లో బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించడంలో కళాకారులు, కథానాయకులు, ఫిలిం మేకర్లు కీలక పాత్ర పోషించగలరని చెప్పారు.

**విద్యుత్ పొదుపుపైనా చైతన్యం అవసరం**

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, వాతావరణ మార్పుల ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించే కథాంశాలను కూడా యువ దర్శకులు ఎంచుకోవాలని సూచించారు. ప్రజల దైనందిన జీవితానికి ఉపయోగపడే సందేశాలను సృజనాత్మకంగా అందిస్తే షార్ట్‌ఫిల్మ్‌లు సామాజిక మార్పునకు దోహదపడతాయని పేర్కొన్నారు.

**కళలు, సృజనాత్మకతకు ప్రభుత్వ ప్రోత్సాహం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కళలు, సృజనాత్మకత పట్ల ఆసక్తి ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి స్వయంగా ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో చదువుకున్న నేపథ్యంలో కళారంగంలోని ప్రతిభను ప్రోత్సహించే ప్రయత్నాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. యువతలోని ప్రతిభను గుర్తించి, వారికి అవకాశాలు కల్పించడం ద్వారా

## పుష్పక విమానంపై గోవర్ధనగిరిధారిగా శ్రీ మలయప్పస్వామి దివ్య దర్శనం

**కొబ్బరి ఆకులతో అద్భుతంగా పుష్పక విమానం.. సంప్రదాయ పుష్పాలతో సుందర అలంకరణ**

**తిరుమల, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 17:** తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన శనివారం సాయంత్రం పుష్పక విమానంపై రుక్మిణి, సత్యభామ సమేతంగా గోవర్ధనగిరిధారి శ్రీకృష్ణుని అలంకారంలో శ్రీ మలయప్పస్వామివారు భక్తులకు అభయమిచ్చారు. స్వామివారి దివ్యమంగళ రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మూడు సంవత్సరాలకు ఒకసారి అధిక మాసం సందర్భంగా నిర్వహించే నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో పుష్పక విమానసేవను నిర్వహించడం విశేషం. వాహనసేవల అనంతరం స్వామి, అమ్మవార్లు సేదతీరే సంప్రదాయంలో భాగంగా ఈ సేవను నిర్వహిస్తారు.

**కొబ్బరి ఆకులతో అద్భుత పుష్పక విమానం**

కొబ్బరి చెట్ల ఆకులతో రూపొందించిన ఈ ప్రత్యేక పుష్పక విమానం 24 అడుగుల ఎత్తు, 15 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పుతో, సుమారు ఒక టన్ను బరువు ఉంటుంది. వివిధ రకాల సంప్రదాయ పుష్పాలతో దీనిని సుందరంగా అలంకరించారు. విమానానికి ఇరువైపులా శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ గరుత్మంతుడు, నాలుగు యుగాలకు చెందిన దేవతామూర్తుల రూపాలను తీర్చిదిద్దారు.

**వారం రోజుల శ్రమతో రూపుదిద్దుకున్న కళాఖండం**

తమిళనాడుకు చెందిన నిపుణులు, టీటీడీ గార్డెన్ విభాగం సిబ్బంది వారం రోజుల పాటు శ్రమించి ఈ అద్భుత పుష్పక విమానాన్ని సిద్ధం చేసినట్లు టీటీడీ గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. చెన్నైకి చెందిన దాత రాంప్రసాద్ భట్ ఈ పుష్పక విమాన రూపకల్పనకు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.











## వినడంలో వివేకం, నమ్మడంలో విచక్షణ




విన్నవన్నీ నిజాలు కాకపోవచ్చు.. వివేచనతో ఆలోచించు.

"మీ ఇద్దరి మధ్య గొడవై తను పుట్టింటికి వెళ్లిన ఈ పది రోజుల నుండి ఒక్కసారైనా నీకు ఫోన్ చేసిందా? తనకు నీ మీద అసలు ప్రేమ ఉందా?" అని అడిగింది తల్లి అతనితో. "మీ ఆవిడను మొన్న ఒక హాస్పటల్లో చూశాను. అబార్షన్ చేయించుకోవడానికి వచ్చినట్టుంది. మీకు పుట్టబోయే ఆ బిడ్డ తనకు అవసరం లేదేమో?" అని చెప్పాడు స్నేహితుడు అతనితో.

"మీ ఆవిడ, నేను చిన్నప్పటినుండి ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్నాం. అప్పటి నుండే తను ఇతరులను పట్టించుకునేది కాదు. అందరితో గౌరవం లేకుండా మాట్లాడేది." అని చెప్పింది స్నేహితురాలు అతనితో. " ఆమె నీకు ఎలా నచ్చింది అసలు? పెళ్లి చూపుల నాడే వద్దని చెప్పాలనుకున్నా. కానీ నువ్వు ఏమనుకుంటావో అని చెప్పలేకపోయా. ఇలా అవుతుందని నేను ముందే ఊహించా" అని దగ్గరి బంధువు ఒకతను చెప్పాడు అతనితో.

ఈ మాటలు అన్నీ విన్న అతను ఇక ఆమెతో ఉండలేనేనే నిర్ణయానికి వచ్చి, విడాకుల కొరకు లాయర్ ను సంప్రదించాడు. ఆ లాయర్ గారు అతడి భార్యను కూడా పిలిపించి, తన భర్త చెప్పిన విషయాలు ఆమెకి వివరించి, అసలేం జరిగింది అని అడిగాడు. వాటన్నిటికీ ఆమె ఇలా సమాధానం ఇచ్చింది.

"చిన్నతనంలో తనతో పాఠశాలలో కలిసి చదివిన స్నేహితురాలు కన్నా నేను ఎక్కువ మార్కులు సాధించేదాన్ని అని నామీద అసూయ పెంచుకొని నాకు దూరమైంది. నా భర్తతో మనస్పర్ధలు వచ్చి మా తల్లిదండ్రులతో ఉన్న సమయంలో హఠాత్తుగా మా నాన్నగారికి గుండె నొప్పి రావడంతో హాస్పిటల్లో చేర్పించాము. రెండు స్టంట్స్ కూడా వేశారు. ఒక వారం రోజులు హాస్పటల్లోనే ఉండాల్సిన పరిస్థితి. ఈ సమయంలో నా భర్తకు ఫోన్ చేస్తే డబ్బు సహాయం కోసం ఫోన్ చేశా అని అపార్థం చేసుకుంటారేమోనని తనకి ఫోన్ చేయలేకపోయాను." అని చెప్పింది.

ఈ సమాధానాలు విన్న భర్త నోట మాట రాలేదు. తనకు ఎవరెవరో ఏమేమో చెప్తే వాటిని నమ్మడం వల్ల పరిస్థితి ఇక్కడిదాకా వచ్చింది. ఆ చెప్పుడు మాటలు విని నిర్ణయం తీసుకునే ముందు, తన భార్యతో కలిసి కూర్చొని మాట్లాడుకుంటే వాస్తవాలు తెలిసేవి కదా. ఇద్దరి మధ్య దూరం పెరిగేది కాదు కదా. తన భార్యకి హాస్పిటల్ లో తోడుగా ఉండాల్సిన క్షణాలన్నీ ఆమె మీద ద్వేషంతోనే గడిచిపోయాయి.

యదార్థాలు వేరు.
వాటి వెనుక కారణాలు వేరు
కానీ ఎవరి కథా అల్లికలు వారివే.
విషయాల మీద సృజనాత్మక పోటీ.
సమాధానాలు అవసరం లేదు ఎవరికీ..
వారి వారి అహం తృప్తి పడితే చాలు.
చుట్టూ ఉండేది ఇదే మిత్రమా.. ఎవరో నడిపే పడవలో ఎంత దూరం, ఎంతకాలం ప్రయాణిస్తావు.

ఏ ఇద్దరి వ్యక్తుల ఆలోచనలు ఒకేలా ఉండకపోవచ్చు, ప్రతీ సంఘటన అందరికీ ఒకేలా అర్థం అవ్వాలని లేదు. కాబట్టి ఎవరు ఏం చెప్పినా అందులో ఎంత నిజం ఉందో, ఎంత కల్పితమో విచక్షణతో ఆలోచించాలి. ఆ మాటలు చెప్పిన వ్యక్తికి "ఆ మాటలు నీతో చెప్పాల్సిన అవసరం ఏముంది?" అని ఆలోచిస్తే ఆ విషయం మరింతగా అర్థం అవుతుంది. ఎవరేం చెప్పినా మనం విన్నంతకాలం చెప్పే వ్యక్తులు ఎదురవుతూనే ఉంటారు. అలాంటి మాటల పట్ల జాగ్రత్త సుమా..

తనకు సంబంధం లేని విషయాలకు, తన ఊహలను జోడించి, తన భావోద్వేగాన్ని కలిపి మరీ ఎదుటి వ్యక్తికి చేరవేసే మనుషులందరూ ఒక విషయం గుర్తుంచుకోవాలి.
అదట.. ఇదట..
అవునట.. అందుకేనట... అంటూ
ఇంకొకరి వెనుక మాట్లాడే ఈ మాటలే నీ గురించి నీ చెవిలో పడే ఒక రోజు వస్తుంది. జీవితమంతా వీటికే పోతే జ్ఞాపకాలలో ఇవే మిగిలిపోతాయి. అందులో నువ్వెక్కడుంటావు.. మేలుకో మిత్రమా ఇకనైనా..

పూర్తిగా తెలియని విషయాల గురించి అంతా తెలిసినట్టు మాట్లాడకు. ఎదుటి వ్యక్తుల జీవితాలని చులకనగా చూడకు.


M. Jaya Krishna Reddy
M.S.(Counselling & Psychotherapy)
Motivational Speaker

Cell: 9640 21 55 41

త్రినేత్ న్యూస్ తెలంగాణ
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
సాంస్కృతికం


# విభిన్న రంగాల ప్రముఖులకు విజయ ప్రతిభా పురస్కారాలు ప్రదానం

**హైదరాబాద్, త్రినేత్ న్యూస్, అక్టోబరు 17 :**
శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళా నిలయం నిర్వహణలో రాబోయే విజయ దశమి పురస్కరించుకుని విభిన్న రంగాల ప్రముఖులకు బిజయ ప్రతిభ పురస్కార ప్రదానం సభ జరిగింది అధ్యాత్మిక వేత్త సంతోష్ శర్మ భరత నాట్య గురువు సుజాత లు అతిథులు గా పాల్గొని ఇరుముడి సినిమా లో నటించిన నటులు మహా దేవ్ మనోజ్ లక్ష్మీ నారాయణ సంగీత గురువులు శ్రీనివాస్, లక్ష్మి తదితరులకు పురస్కారాలు ప్రదానం చేశారు సినీ నిర్మాత బద్రి నాథ్ రాజకీయ ప్రముఖుడు వీర భోగ వసంత రాయలు తదితరులు తమ అభినందన తెలిపారు సురేందర్ కార్యక్రమ నిర్వహణ చేయగా సంస్థ అధ్యక్షులు పుష్ప లత స్వాగతం పలికారు తొలుత కళ్యాణ భార్గవి ఫణి దుర్గ, నట సాయి సుజాత తదితరులు శిష్య బృందం శాస్త్రీయ నృత్య అంశాలు ప్రదర్శించి ప్రశంస పొందారు






# త్రినేత్ న్యూస్ శశిమోహన కాంతి కిరణం...

**' పైన పటారం ....లోన లొటారం "**

పైకి చాలా చాలా గొప్పగా ఆడంబరంగా, అతిశయంగా కనపడుతూ.... లోపల మాత్రం ఏమీ లేకుండా ఉండటాన్నే " పైన పటారం లోన లొటారం " అంటారు.

ఈ రోజుల్లో మనుషులు తాము జీవించడం కంటే ఇతరుల కోసం బ్రతకటం, ఇతరుల కోసం మాట్లాడటం , ఇతరుల కోసం ఆడంబరాలకు పోవడం బాగా ఎక్కువైంది. కొందరు సమాజంలో తమకంటూ ప్రత్యేకత ఉన్నదని నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటారు.

వారికి ఏమీ రాకున్నా మహాకవులమని చెప్పుకుంటూ తిరుగుతారు. సన్మానాలు పొందుతారు. ఏమీ లేకున్నా మేము అంతవారం , ఇంతవారం అంటూ కోతలు కోస్తుంటారు.

అప్పులు చేసైనా సరే, పెద్ద పెద్ద ఇళ్ళు కొనడం, ఆస్తులు ఏర్పరచుకోవడం, విలాసవంతమైన కార్లలో తిరగటం, ఖరీదైన బట్టలు ధరించటం , నగలు ధరించడం లాంటివి చేసి జనాల కళ్ళల్లో దుమ్ము కొడుతూ ఉంటారు. కొందరైతే చెల్లని చెక్కులు ఇచ్చి దానాలు చేయటం,



బినామీ భూములను దానం చేయడం లేదా అమ్మటం లాంటివి చేస్తూ సంఘంలో పెద్ద మనుషులుగా చలామణి అవుతున్నారు. ఫేస్ బుక్, ఇన్స్టా గ్రామ్ లాంటి అంతర్జాల వేదికలపై రకరకాల ఫోటోలు పెట్టి తాము ఎంతో గొప్ప వారమైనట్లు కృత్రిమ హోదాను ప్రదర్శిస్తూ ఉంటారు.

ఇంకా కొంతమంది మాటల్లో ఎంతో సంస్కారవంతులుగా ,నీతిమంతులుగా నటిస్తూ లోపల మాత్రం కుళ్ళు, కుతంత్రాలు, స్వార్థంతో నిండి ఉంటారు.

బయట కనిపించే రూపానికి లోపల ఉండే గుణానికి ఎంతో వ్యత్యాసం ఉందని ఈ సామెత విశదీకరిస్తున్నది.

మనం బయట ప్రపంచంలో ఎన్నో చూస్తున్నాం. ఎంతోమంది వేదికలపై గంటలు గంటలు మాట్లాడటం గురించి చూస్తున్నాం ,వింటున్నాం. చాలామంది వేదికల మీద నీతి నియమాల గురించి, సమాజ శ్రేయస్సు గురించి గంటలు తరబడి ఉపన్యాసాలు ఇస్తారు. కానీ వారి వ్యక్తిగత జీవితంలో లేదా వారి నిజ స్వరూపంలో తాము చెప్పే దానికి పూర్తిగా విరుద్ధంగా ప్రవర్తిస్తారు. కొంతమంది మాటల్లో ఆదర్శమూర్తులుగా ఉన్నా, ఇంటిలో వారి తీరు ఆ నాలుగు గోడలకే తెలుసు వారెంత క్రూరాత్ములని. ముసుగులో ఉన్న వారి అసలు రూపం బహిర్గతమైనప్పుడు, లోకం వారిని అసహ్యించుకుంటుంది. ఆ ప్రభావం వారి మీదే కాదు, అన్నెం పున్నెం ఎరుగని వారి కుటుంబ సభ్యుల పైన కూడా బాగా పడుతుంది. వారితో సంబంధం బాంధవ్యాలు పెంచుకోవటానికి భయపడతారు.

ఈ వ్యాసం యొక్క సారాంశం ఏమిటంటే....

కంటికి కనిపించే ప్రతిదీ నిజం కాదు. కేవలం బాహ్య రూపం, బాహ్య సౌందర్యాన్ని ఆడంబరాలని చూసి ఒకరి జీవితాన్ని అంచనా వేయకూడదు అనే సందేశాన్ని తెలియజేస్తున్నది. ప్రదర్శనల కోసం కాకుండా మనస్ఫూర్తిగా ,ప్రశాంతమైన నిజాయితీతో కూడిన జీవితాన్ని గడపటం ఉత్తమం అని ఈ వ్యాసం ద్వారా నేను తెలియజేస్తున్నాను. కపట ముసుగులు ధరించి బ్రతికే జీవితం ఎంతో కాలం సాగదు. ఎప్పటికైనా నిజం అనేది బయటపడక మానదు. కాబట్టి ఆడంబరాలకు, నటనకు దూరంగా ఉంటూ నిజాయితీతో కూడిన అంతరంగాన్ని కలిగి ఉండటమే మనిషికి నిజమైన అందమనే సత్యాన్ని గ్రహించాలి.

ఈ సామెత కేవలం మనుషుల తత్వాల మీదే కాదు.

నేటి వ్యాపార ప్రపంచానికి కూడా వర్తిస్తుంది. మార్కెట్లో అనేక వస్తువులు దొరుకుతున్నాయి .ఎంతో ఆకర్షణీయంగా రంగు రంగులుగా ఉంటాయి. ప్రకటనలు చూసి మనం ఆ వస్తువులను కొనుగోలు చేసి మోసపోతాం. వాడి చూస్తే గాని వాటిల్లోని నాణ్యత అర్థం కాదు. అందుకే మిత్రులారా ఏ పని చేసినా, ఏ వస్తువు కొన్నా, ఎవరిని నమ్మినా ఆచితూచి అడుగులు వేయాలి. బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

శశిబాల

# రవీంద్రభారతిలో ఘనంగా వెన్నముద్దల బతుకమ్మ






**ఆడిపాడిన తెలంగాణ రెడ్డి సమితి మహిళలు**

**పూలను, ప్రకృతిని ప్రేమించే పండుగ బతుకమ్మ: ఏనుగు నరసింహారెడ్డి**

**హైదరాబాద్, త్రినేత్ న్యూస్, అక్టోబర్ 17:**
రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాల్లో భాగంగా శనివారం ఎనిమిదో రోజు 'వెన్నముద్దల బతుకమ్మ' వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ రెడ్డి సమితికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. తంగేడు, గునుగు తదితర రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. పూలను, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. ఎనిమిదో రోజు వెన్నముద్దలను నైవేద్యంగా సమర్పించడం సంప్రదాయంలో విశిష్టమైనదని తెలిపారు. తెలంగాణ మహిళల ఐక్యతకు, రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న తొమ్మిది రోజుల సంబరాలు నిదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు. వేడుకల్లో మహిళలు, చిన్నారులు, వివిధ రంగాల కళాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భాషా సాంస్కృతిక శాఖ సిబ్బంది, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.



# గుండెకు బైపాస్..

## సంకల్పంలో 'పవర్'ఫుల్.. దటీజ్ శంకరరావు!

ఏడు పదుల వయసు.. పైగా బైపాస్ సర్జరీ జరిగింది.. అలాంటి వ్యక్తి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని పతకం సాధించడమంటే.. అంత ఆషామాషీ కాదు. కానీ, అచంచలమైన ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమేనని నిరూపించారు భద్రాచలానికి చెందిన 74 ఏళ్ల రిటైర్డ్ ఎస్‌బీఐ అధికారి డీవీ శంకరరావు. అమెరికాలోని రెనో నగరం వేదికగా జరుగుతున్న 2026 ఐపీఎఫ్ వరల్డ్ మాస్టర్స్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తా చాటారు. ఈ వయసులోనూ అనారోగ్య సమస్యల్ని సైతం అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో నెగ్గి ఔరా! అనిపించిన శంకరరావు స్ఫూర్తిదాయక ప్రస్థానం గురించి ఆయన మాటల్లోనే..




"నాకు 60ఏళ్ల వయసులో తీవ్రమైన గుండె సమస్య కారణంగా కరోనరీ బైపాస్ సర్జరీ జరిగింది. ఆ తర్వాత యోగా, ధ్యానం, శారీరక దృఢత్వంపై దృష్టి సారించా. అలా సాధారణ ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రారంభమైన నా ప్రయత్నం.. కాలక్రమేణా పవర్‌లిఫ్టింగ్‌పై ఆసక్తిగా, చివరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలనే లక్ష్యంగా మారింది. బైపాస్ సర్జరీ జరిగిన వ్యక్తి పవర్‌లిఫ్టింగ్ వంటి బరువులు ఎత్తే క్రీడలో విజయాలు సాధించడమంటే సాధారణ విషయం కాదు. ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించుకుంటూ, శరీర సామర్థ్యానికి అనుగుణంగా సాధన చేస్తూ ముందుకు సాగాను.

నా విజయానికి ఆ రెండే పునాది..

నా గుండెకు బైపాస్ జరిగింది కానీ నా ఆశయాలకు, ఆత్మవిశ్వాసానికీ కాదు. కఠోర సాధన, క్రమశిక్షణే నా విజయానికి పునాది. పవర్‌లిఫ్టింగ్‌లో నెగ్గాలంటే కేవలం బరువులు ఎత్తడం మాత్రమే సరిపోదు.. ఇందుకోసం ప్రత్యేక నైపుణ్యం, శారీరక సమతుల్యత, సాంకేతిక పరిజ్ఞానం, మానసిక ఏకాగ్రత, సాధన అవసరం. ఈ క్రమంలో ఎంతో క్రమశిక్షణ, విశ్రాంతి, శరీర బరువు నియంత్రణ, ఆహార నియమాలు కూడా ఎంతో కీలకం. గతంలో 83కిలోల విభాగంలో పోటీపడిన నేను, క్రమంగా శరీర బరువును తగ్గించుకొని 74 కిలోల విభాగంలో పోటీపడే స్థాయికి చేరుకున్నాను. 2026 జులైలో జాతీయ పోటీలకు ముందు సాధన చేస్తున్న సమయంలో వెన్నెముక, తొడల వెనుక భాగంలో నొప్పి కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురైనా సరే.. పట్టుదలతో జాతీయ పోటీల్లో పాల్గొని రజత పతకాలు సాధించాను.

సొంత ఖర్చులతో..

ప్రపంచ పోటీలకు అర్హత సాధించడం ఒక ఎత్తైతే.. అక్కడికి చేరుకోవడం మరో పెద్ద సవాలు. విమాన ప్రయాణం, హోటల్‌లో వసతి, ఫెడరేషన్ రుసుములు, డోప్ పరీక్షల ఛార్జీలు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన క్రీడా పరికరాలు, ఆహారం, ఇతర ఖర్చులు కలిపి రూ.5 లక్షలకు పైగా వ్యయం అవుతోంది. తెలంగాణ క్రీడాశాఖ అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించినప్పుడు సానుకూల స్పందన వచ్చినప్పటికీ సకాలంలో సహాయం అందలేదు. దీంతో దాచుకున్న కొంత డబ్బుతో పాటు స్నేహితుల నుంచి అప్పు తీసుకొని సొంత ఖర్చులతోనే అమెరికాలో పోటీలకు హాజరయ్యా. అక్టోబర్ 22న జరగనున్న ఎక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లోనూ భారత్ తరఫున పాల్గొనబోతున్నాను. ఆ పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రదర్శనతో మరో పతకం సాధించాలనే దృఢ సంకల్పంతో ముందుకెళ్తున్నా" అని శంకరరావు తెలిపారు.

పవర్‌లిఫ్టింగ్ ప్రస్థానంలో విజయాలివే..

ఆగస్టు 2025 – కొయ్‌కోడ్, కేరళ: జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు స్వర్ణ పతకాలు, ఓవరాల్ ఛాంపియన్‌షిప్.

జనవరి 2026 – ఫరీదాబాద్, హరియాణా: జాతీయ బెంచ్‌ప్రెస్ పోటీల్లో కాంస్య పతకం.

జులై 2026 – ఛత్రపతి శంభాజీనగర్, మహారాష్ట్ర: జాతీయ పోటీల్లో ఎనిమిది రజత పతకాలు.

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136